


శ్రీకృష్ణ టెంపుల్‌లో

వైభవంగా వైకుంఠ ఏకాదశి

- కిటకిటలాడిన వైష్ణవాలయాలు
- భక్తులకు ఉత్తర ద్వార దర్శనం







కర్నూలు కల్చరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి వేడుకలు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. గురువారం రాత్రి నుంచి పలు వైష్ణవాలయాలకు భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. ఆలయాలను తెరచి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు ఉత్తరద్వార దర్శనం కల్పించారు. వైకుంఠ ఏకాదశి రోజున విష్ణుమూర్తిని దర్శించుకుంటే వైకుంఠ ప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం. దీంతో శుక్రవారం భక్తులు వేలాదిగా వైష్ణవాలయాలకు తరలివచ్చారు. అలంకార ప్రియుడైన విష్ణుమూర్తిని, లక్ష్మీ దేవి, గోదాదేవి అమ్మవార్ల మూల మూర్తులను, ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించారు. ఆలయాలకు విభిన్న రంగుల్లోని పుష్పాలతో తోరణాలతో ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా అన్ని ఆలయాలు భక్తజన సందోహంతో కిటకిటలాడాయి.





నగరంలోని హరిహర క్షేత్రంలో ఉత్తర ద్వార దర్శనానికి భక్తుల క్యూ







వాసవీ నగర్‌లోని ఆలయంలో వేంకటేశ్వర స్వామి



75 ఏళ్ల వేడుక

- 12న ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు
- కలుసుకోనున్న పూర్వ విద్యార్థులు
- సిద్ధమైన ఎమ్మిగనూరు పాఠశాల

7

జగన్‌ను ప్రజలు తరిమికొడతారు

కుడా చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి

మహానందిలో 'ముక్కోటి' పూజలు

7

వాళ్లవి శవ రాజకీయాలు

- ఉనికి కోసమే వైసీపీ నాయకుల అసత్య ఆరోపణలు
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



మాట్లాడుతున్న రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, మాజీ మంత్రి రోజా శవ రాజకీయాలు చేస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆరోపించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తిరుమలలో భక్తుల రద్దీ వల్ల జరిగిన హఠాత్ పరిణామం మీద వైసీపీ నాయకులు శవ రాజకీయాలు చేస్తున్నారని ఆమె అన్నారు. బాబాయి గొడ్డలి పోటు, కోడి కత్తి, గులకరాళ్ల ఘటనలు ఎలా జరిగిందీ ప్రజలందరికీ తెలుసునన్నారు. గతంలో అన్నమయ్య జిల్లాలో వరదలు సంభవించినప్పుడు వరద బాధితులను చంద్రబాబు నాయుడు, భువనేశ్వరి సందర్శించి పరామర్శించారని, ఆర్థిక సాయం చేశారని అన్నారు. విజయవాడలో వరదలు వచ్చినప్పుడు కలెక్టరేట్‌లో సీఎం చంద్రబాబు నాయుడు రాత్రింబవళ్లు ఉండి పర్యవేక్షించారన్నారు. తిరుపతిలో జరిగిన సంఘటన చాలా బాధాకరమన్నారు. సంఘటన జరిగిన వెంటనే అక్కడకు సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రులు పవన్ కళ్యాణ్, అనిత వెళ్లి పరిశీలించారన్నారు. బాధితులను పరామర్శించి రూ.25 లక్షల ఆర్థిక సాయాన్ని, గాయపడిన ఆసుపత్రిలో కోలుకుంటున్న బాధితులకు రూ.2.50 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఆర్థిక సాయం ప్రకటించారన్నారు. ఇవన్నీ మరిచి వైసీపీ నాయకులు తమ పార్టీ ఉనికి కోసం అసత్య ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, టీడీపీ నాయకులు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

సోలార్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు పరిశీలన



కర్నూలు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కళ్యాణ్ శనివారం జిల్లా పర్యటనకు రానున్నారు. ఓర్వకల్లు మండలంలో నిర్మించిన సోలార్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులను ఆయన పరిశీలిస్తారు. ఉదయం 10.35 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి 11.30 గంటలకు కర్నూలు (ఓర్వకల్లు) విమానాశ్రయం చేరుకుంటారు. ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా ఓర్వకల్లు, గని సోలార్ విద్యుత్ ప్రాజెక్టు సహా పిన్నాపురం, గుమ్మటంతండాల మధ్య నిర్మించిన పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టును 11.45 నుంచి 12.30 గంటల వరకు ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలిస్తారు. పాణ్యం మండలం పిన్నాపురం వద్ద 5,230 మెగావాట్ల యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పోలార్, విండ్, హైడల్ (పంప్డ్ స్టోరేజ్) విద్యుత్ సబంధించిన ఇంటిగ్రేటెడ్ పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టు (ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టు-ఐఆర్ఈపీ) నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వంలో శ్రీకారం చుట్టారు. మధ్యాహ్నం 12.40 గంటలకు అప్పర్ రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకొని 1.15 గంటల వరకు అప్పర్ ఇన్‌టెక్ వ్యూ పాయింట్, అక్కడి నుంచి 1.25 గంటలకు పవర్ హౌస్‌కు చేరుకొని పరిశీలిస్తారు. 2.15 గంటలకు గెస్ట్ హౌస్ చేరుకొని 3.30 గంటల వరకు భోజనం, విశ్రాంతి తీసుకుంటారు. 3.35 గంటల నుంచి 4.05 గంటల వరకు ఈ ప్రాజెక్టుపై సంబంధిత అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు వివరిస్తారు. ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా 4.50 గంటలకు ఓర్వకల్లు విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి గన్నవరం బయలుదేరుతారు.



- ఉమ్మడి జిల్లాలో జోరుగా అక్రమ రవాణా
- జీరో వ్యాపారంతో ఖజానాకు గండి
- నిఘా అధికారుల కళ్లకు గంతలు
- దొరికితేనే దొంగలు.. లేదంటే దొరలే

దొంగ బంగారం

బంగారాన్ని అక్రమ మార్గాల్లో విక్రయించేవారు పెరిగిపోయారు. కొందరు ప్రభుత్వానికి సుంకం చెల్లించకుండా జీరో వ్యాపారం ద్వారా ప్రభుత్వ ఖనాజాకు గండి కొడుతున్నారు. కర్నూలు శివారులో పంచలింగాల చెక్‌పోస్టు దాటుకొని రూ.కోట్ల విలువైన బంగారం హైదరాబాదు, బెంగళూరు, చెన్నై నగరాలకు తరలిపోతోంది. దొరికితేనే దొంగలు.. లేదంటే దొరలే. కేరళ రాష్ట్రం ఎర్నాకులం నుంచి ఆదోని పట్టణానికి రూ.10 కోట్లకు పైగా విలువైన 13 కిలోల బంగారు ఓ రైలులో అక్రమ రవాణా చేస్తూ సెంట్రల్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ అధికారులకు పట్టుబడ్డారు. ఈ ఘటన బంగారం అక్రమ రవాణా ఏ స్థాయిలో ఉందో బట్టబయలు చేసింది. ఈ వివరాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.



కర్నూలు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆదోని, కర్నూలు, నంద్యాల, ఎమ్మిగనూరు, డోన్ పట్టణాల్లో బంగారు వ్యాపారం జరుగుతోంది. ఇందులో ముప్పాతిక వంతు ఆదోని, కర్నూలు నగరంలోనే జరుగుతోంది. ఆదోని పట్టణంలో 250 మంది, కర్నూలు నగరంలో 250-300 మంది వరకు బంగారులు వ్యాపారులు ఉన్నా.. ప్రభుత్వం నుంచి లైసెన్సులు లేకుండా వ్యాపారం చేస్తున్నవారే అధికం. ఉమ్మడి కర్నూలులో దాదాపుగా 850 మందికిపైగా బడా, చోటా వ్యాపారులు ఉన్నారని ఓ బంగారు వ్యాపారి తెలిపారు. ఒక్కో వ్యాపారి సగటున రూ.కోటి నుంచి రూ.2 కోట్ల వరకు బంగారు వ్యాపారం చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఈ లెక్కన ఎంత తక్కువ కాదన్నా ఏడాదికి రూ.750 కోట్లకు పైగా బంగారు క్రయ విక్రయాల లావాదేవిలు జరుగుతున్నాయని అంటున్నారు. పాత బంగారం విక్రయించినా.. కొత్త బంగారం కొనుగోలు చేసినా తరుగు, మేకింగ్ చార్జీలు వసూలు చేస్తారు. లాభం సరేసరి. ఏటా రూ.కోట్ల లావాదేవీలు జరగుతుండడంతో జీఎస్టీ లెక్కలు చూపించలేక జీరో దందాకు తెర తీశారు. తద్వారా బంగారం అక్రమ రవాణా ఉధృతమైంది.

● జోరుగా జీరో దందా..!

రత్నాలు, బంగారు ఆభరణాలు తయారీ, విక్రయాల రంగంలో దేశంలో సుమారుగా 50 లక్షల మందికిపైగా ఉపాధి పొందుతున్నారు. ఎగుమతుల్లో ఈ రంగం వాటా 8 శాతం. పరోక్ష పన్నులు, కస్టమ్స్ కేంద్రం (సీబీఐసీ) ఛైర్మన్ సంజయ్ కుమార్ మలోహత్రా గత ఏడాది జూలైలో జరిగిన ఓ సమావేశంలో వెల్లడించారు. ఈ రంగంపై ఆధారపడి ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో దాదాపుగా 4,500 నుంచి 5 వేల మందికిపైగా ఉపాధి పొందుతున్నట్లు తెలుస్తోంది. ఉపాధి అవకాశాలు ఏ స్థాయిలో ఉన్నాయో.. అదే స్థాయిలో అక్రమ రవాణా, జీరో దందా కూడా సాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఓ రాష్ట్రం నుంచి మరో రాష్ట్రంలోని పట్టణం, నగరాలకు ముడి బంగారు బిస్కెట్లు (24 క్యారెట్ల గోల్డ్ బార్) ఎలాంటి బిల్లులు, సుంకం చెల్లించకుండా అక్రమ రవాణా చేయడం ఒక ఎత్తు అయితే.. ఆభరణాలు తయారీ చేసి విక్రయించినప్పుడు బిల్లులు ఇవ్వకుండా చిత్తు కాగితాలపై రాసిస్తూ జీవో దందాకు పాల్పడటం ఇంకో ఎత్తు. తద్వారా జీఎస్టీ, ఆదాయ పన్ను చెల్లించకుండా ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారు. బంగారు వ్యాపారి ఒక ఏడాదిలో చేసే వ్యాపారంలో 30-40 శాతానికి మించి జీఎస్టీ లెక్కలు చూపడం లేదని ఓ వ్యాపారి పేర్కొనడం కొసమెరుపు. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వానికి ఏడాదిలో రూ.15-20 కోట్లకు పైగా జీఎస్టీ రూపంలో ఎగనామం పెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో బంగారు క్రయ విక్రయాలపై ఒక శాతం జీఎస్టీ ఉంటే.. ప్రస్తుతం 3 శాతం జీఎస్టీ వసులు చేస్తున్నారు. జీఎస్టీ పెంచడం కూడా అక్రమ వ్యాపారానికి ఓ కారణమని వ్యాపారి ఒకరు పేర్కొన్నారు. అక్రమ రవాణాను, జీరో వ్యాపారాన్ని అరికట్టి ప్రభుత్వ ఖజానా రాబడి పెంచాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

మిగతా 6వ పేజీలో

సంక్రాంతి ఉత్సవాలకు వేళాయే..!



సంక్రాంతి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన శ్రీశైలం ఆలయం

శ్రీశైలం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో మకర సంక్రమణ పుణ్యకాలాన్ని పురస్కరించుకుని ఈ నెల 11 నుంచి 17 వ తేదీ వరకు సంక్రాంతి బ్రహ్మోత్సవాలను దేవస్థానం వైభవంగా నిర్వహించనుంది. 11వ తేదీ శనివారం ఉదయం 8.45 గంటలకు స్వామివారి యాగశాల ప్రవేశంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 12వ తేదీన భృంగి వాహనసేవ, 13న కైలాస సేవ, 14న మకర సంక్రాంతి పర్వదినం రోజున నంది వాహనసేవ, కల్యాణోత్సవం, 15న రావణ వాహనసేవ, 16న యాగపూర్ణాహుతి, కలశోద్వాసన, త్రిశూలస్నానం, ధ్వజావరోహణ కార్యక్రమాలు, 17న రాత్రి అశ్వవాహనసేవ, శయనోత్సవం, ఏకాంత సేవలతో ఉత్సవాలు ముగుస్తాయి.

పెరిగిన పత్తి ధర

క్వింటం రూ.7,595



విక్రయానికి వచ్చిన పత్తి దిగుబడులు

ఆదోని అగ్రికల్చర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పత్తి ధరలు మళ్లీ పుంజుకుంటున్నాయి. శుక్రవారం పత్తిధర క్వింటా గరిష్ఠంగా రూ.7,595 పలికింది. చాలా రోజుల తర్వాత ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర కంటే ఎక్కువ ధర పలికింది. గతవారంతో పోల్చితే పత్తి ధర గరిష్ఠంగా క్వింటాకు రూ.250 పైగా పెరిగింది. ధరలు పెరుగుతుండటంతో పత్తి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 2,385 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర రూ.5వేలు, గరిష్ఠ ధర రూ.7,595 మధ్యస్థంగా రూ.7289 పలికింది.

నాణ్యత నగుబాటు

నల్లమలలో కొలువై.. భక్తులచే విశేష పూజలందుకుంటున్న ప్రాచీన ఆలయం అభివృద్ధిలో వెనుకబడింది. ఘనమైన చరిత్ర కలిగిన పురాతన ఆలయం అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో ప్రాభవం కోల్పోతోంది. నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారిలో నల్లమల అటవీ ప్రాంతంలో ఆధ్యాత్మికతకు నిలయమైన సర్వలక్ష్మీ నరసింహ స్వామి ఆలయం ఉంది. 15వ శతాబ్దంలో శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మించారని చరిత్ర చెబుతున్న పురాతన సర్వలక్ష్మీ నరసింహ స్వామి ఆలయ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన మారింది. 2018లో కురిసిన వర్షాల ధాటికి ఆలయ ముందు భాగంలోని పురాతన రాతి కట్టడం, ప్రహరీ, ధ్వజస్తంభం కూలిపోయాయి. దీంతో టీటీడీ నిధులతో ప్రారంభించిన పనుల్లో నాణ్యత లోపించడంతో ఆలయ కింది భాగంలో నిర్మించిన రక్షణ గోడ కూలిపోయింది. ఏళ్లు గడుస్తున్నా అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. ఎంతో ప్రాశస్త్యం కలిగిన ఆలయం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండడంతో భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శిరివెళ్ల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) :



ఆలయం కింది భాగంలో కూలిన రక్షణ గోడ

- ఆలయ అభివృద్ధి పనుల్లో ఇష్టారాజ్యం
- రెండున్నరేళ్లుగా కొనసాగుతున్న పనులు
- నిర్మాణ దశలోనే కూలిన రక్షణ గోడ
- ఆదాయం ఉన్నా అభివృద్ధికి నోచుకోని ప్రాచీన ఆలయం
- గడువు ముగిసినా నిర్వహించని వేలంపాటలు

టీటీడీ నిధులతో పనులు

2018లో కురిసిన వర్షాలకు ఆలయ ముందు భాగంలోని రాతి కట్టడం, ధ్వజస్తంభం కూలిపోయాయి. ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా రూ.20 లక్షల దేవదాయశాఖ నిధులతో 2020 వరకు ఫౌండేషన్ పనులు చేపట్టారు. ఆలయం కింద నుంచి పైభాగం వరకు దాదాపు 50 అడుగుల మేర నిర్మాణ పనులు చేపట్టాలంటే కోట్ల రూపాయలు అవసరమైనందున పనులు ముందుకు సాగలేదు. 2022లో కార్యనిర్వహణాధికారి, చైర్మన్, గ్రామ పెద్దలు సమస్యను అప్పటి ఆళ్లగడ్డ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆలయ అభివృద్ధి కోసం నివేదికను తయారు చేయించి వివిధ పనుల నిమిత్తం రూ.1.6 కోట్ల టీటీడీ నిధులు మంజూరు చేయించారు. దీంతో 2022 జూన్ 4న పటిష్ట రక్షణ గోడ నిర్మాణ పనులను అధికారికంగా ప్రారంభించారు. నేటికి రెండున్నరేళ్లు గడుస్తున్నా నిర్మాణ పనులు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి.

సర్వలక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ముఖద్వారం





సర్వలక్ష్మీ నరసింహ స్వామి మూలవిరాట్

కూలిన ధ్వజస్తంభం.. నిలిచిన కల్యాణం

సర్వలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ప్రతి నెలా స్వాతి నక్షత్రం, పౌర్ణమి రోజుల్లో స్వామి వారి ఉత్సవమూర్తులకు కల్యాణాన్ని వైభవంగా నిర్వహించి భక్తులకు అన్నదానం చేసేవారు. ఆలయ ముందుభాగంలో ఉన్న ధ్వజస్తంభం 2018లో కూలిపోవడంతో అప్పటి నుంచి నేటి వరకు స్వామి వారికి కల్యాణం నిర్వహించడం లేదు. అలాగే ఏడాదికి ఒకసారి వచ్చే నరసింహ స్వామి జయంతి రోజు సైతం కల్యాణం నిర్వహించకపోవడంతో భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. భక్తులకు కొంగు బంగారమైన నారసింహుడి ఆలయంలో నిత్య పూజలు మాత్రమే జరుగుతుండడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉత్తర ముఖ ద్వార దర్శనం కలిగిన వైష్ణవ ఆలయం కావడంతో రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి తరలివచ్చి స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు కనీస సౌకర్యాలు సైతం కల్పించకపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆలయ ముందు భాగంలో నిలిచిన అభివృద్ధి పనులు

నాణ్యతకు తిలోదకాలు

రక్షణ గోడ నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ నాణ్యతకు తిలోదకాల్విడంతో గోడ (సైడ్ వాల్) నిర్మించిన కొద్ది రోజుల్లోనే కూలిపోయింది. సరైన నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతోనే గోడ కూలిపోయిందని తెలుస్తోంది. భక్తులు ఎవరూ లేని సమయంలో సైడ్‌వాల్ కూలడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. గోడ కూలి నెలలు గడుస్తున్నా నేటికీ కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఆలయ ముందు భాగంలో మట్టిని నింపి చదును చేయాల్సి ఉండగా పనులు అర్ధాంతరంగా నిలిపివేశారు. నిధుల కొరతతో పనులు చేపట్టడం లేదా.. బిల్లులు రాకపోవడంతో పనులు నిలివేశారా అన్న ప్రశ్న తలెత్తుతోంది.



ప్రధాన రహదారిపై ఉన్న నారసింహుడి ఉపాలయం

ఆదాయం ఘనం .. అభివృద్ధి శూన్యం

సర్వలక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి ఏడాదికి రూ.15 నుంచి రూ.18 లక్షల మేర ఆదాయం సమకూరుతోంది. మాన్యం భూములు, భక్తులు సమర్పించే హుండీ కానుకలు, తలనీలాలు, కొబ్బరి కాయలు, బొమ్మలు, చిత్రపటాలు, కూల్ డ్రింక్స్ విక్రయాలతోపాటు భక్తులు ఇచ్చే మిశ్రమ బియ్యం బహిరంగ వేలం పాటల ద్వారా ఈ ఆదాయం వస్తోంది. రూ.లక్షల్లో ఆదాయం వస్తున్నప్పటికీ ఆలయాన్ని ఏమాత్రం అభివృద్ధి చేశారని భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఆలయం వద్ద భక్తులకు కనీస వసతులు కరువయ్యాయి. తాగునీరు, మరుగుదొడ్లు లేకపోవడంతో భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు. దేవదాయశాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరితో ఆలయ అభివృద్ధి మరుగునపడింది. బహిరంగ వేలంపాట ద్వారా ఆలయానికి రావాల్సిన ఆదాయాన్ని సమకూర్చడంలో సంబంధిత అధికారి నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వేలంపాట గడువు ముగిసి నెలలు గడుస్తున్నప్పటికీ వేలం నిర్వహించకపోవడంతో ఆలయ ఆదాయానికి గండి పడుతోంది.

పనులు ప్రారంభమవుతాయి

సర్వలక్ష్మీ నరసింహ స్వామి ఆలయ అభివృద్ధి పనులు త్వరలోనే ప్రారంభమవుతాయి. ప్రహరీ కోసం గతంలో వేసిన ప్రణాళికను, డిజైన్‌ను టీటీడీ అధికారులు మార్చారు. అందుకు సంబంధించి ఎస్టిమేషన్ పూర్తవడంతో అనుమతులు సైతం మంజూరయ్యాయి. ఆలయ అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించకుండా చర్యలు తీసుకుంటాం. పనులు సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. అలాగే బహిరంగ వేలంపాటను త్వరలోనే నిర్వహిస్తాం.

- బీవీ నరసయ్య, ఆలయ ఈవో

దొంగ బంగారం



2021లో పంచలింగాల చెక్‌పోస్టు వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు బిస్కెట్లు

(5వ పేజీ తరువాయి)

ఆదోని అడ్డాగా బంగారు అక్రమ రవాణా!

ఆదోని పట్టణం వ్యాపార, వాణిజ్య రంగంలో రెండో ముంబాయిగా ప్రసిద్ధి చెందింది. అదే స్థాయిలో బంగారు అక్రమ రవాణా అడ్డాగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. కేరళ రాష్ట్రం ఎర్నాకులం పట్టణం నుంచి ఆదోనికి చెందిన 12 మంది బంగారు వ్యాపారులు 13 కిలోల బంగారం (విలువ రూ.10 కోట్లు పైమాటే) అక్రమంగా కన్యాకుమారి - పూణే ఎక్స్‌ప్రెస్ రైలులో రవాణా చేస్తుండగా సెంట్రల్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ శాఖ సూపరింటెండెంట్ శ్యాంసుందర్‌రెడ్డి, సిబ్బంది దాడులు చేసి స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. పట్టుబడిన వ్యాపారుల్లో పట్టణంలో ఓ ప్రముఖ బంగారు వ్యాపారి కుమారుడు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. గత ఏడాది జూలై మాసంలో చెన్నై నుంచి ఎలాంటి బిల్లులు లేకుండా రెండు కిలోలు (విలువ రూ.1.50 కోట్లు పైమాటే) బంగారం సీజ్ చేసి.. ఆ తరువాత మామూళ్లు పుచ్చుకొని వదిలేశారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో కూడా అక్రమ రవాణా చేస్తూ పట్టుబడి.. తరువాత రాజకీయ నేతల జోక్యం, వారి అండదండలతో కేసులు లేకుండా బయటపడిన సంఘటనలు ఉన్నాయి. ఆదోనిలో ఒక్కటే కాదు.. కర్నూలు, నంద్యాల పట్టణాల్లో కూడా బంగారు జీరో వ్యాపారం జోరుగా సాగుతుందనే ఆరోపణలు ఉన్నాయి.

బంగారం అక్రమ రవాణా సంఘటనలు కొన్ని..

- 2017 సెప్టెంబరులో కర్నూలు నగర శివారులో అక్రమంగా తరలిస్తున్న దాదాపు 16 కిలోల బంగారు పోలీసులు సీజ్ చేశారు. పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా ఇన్నోవా కారులో ఈ బంగారం తరలిస్తుండగా పట్టుబడింది. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు తరలిస్తున్నట్లు నాడు పోలీసులు గుర్తించారు.
- 2021 మార్చి నెలలో హైదరాబాద్ నుంచి అనంతపురం జిల్లా తాడిపత్రికి అక్రమంగా 14.8 కిలోలు బంగారం రవాణా చేస్తుండగా కర్నూలు నగర శివారులో పంచలింగాల చెక్ పోస్టు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సరైన రికార్డులు చూపకపోవడంతో బంగారు సీజ్ చేశారు.
- 2021లో కర్నూలు నగరంలోని ఓ బంగారు దుకాణంలో పని చేస్తున్న వ్యక్తి హైదరాబాదు నుంచి కర్నూలుకు ఓ ప్రైవేటు బస్సులో తీసుకొస్తుండగా పంచలింగాల చెక్ పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న అప్పటి సెబ్ సీఐ లక్ష్మీదుర్గయ్య 1.818 కిలోల బంగారు సీజ్ చేశారు. విలువ రూ.1.80 కోట్లు ఉంటుందని అంచనా. ఎలాంటి బిల్లులు లేకుండా రవాణా చేస్తున్నట్లు గుర్తించారు.
- 2021 జూన్ 24న మాసంలో బెంగళూరుకు చెందిన ఓ వ్యాపారి ఓ ప్రైవేటు ట్రావెల్ బస్సులో 5 కిలోల బంగారం ఎలాంటి రికార్డులు లేకుండా రవాణా చేస్తున్నారు. పంచలింగాల చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేసిన సెబ్ పోలీసులు సీజ్ చేశారు. బంగారు నగల వ్యాపారిని అదుపులోకి తీసుకున్నారు.
- అదే ఏడాది జూన్ 11న కర్నూలు నగర శివారులోని పంచలింగాల చెక్‌పోస్టు దగ్గర హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న ఓ కారును సెబ్ పోలీసులు తనిఖీ చేయగా.. 7 కిలోలు బంగారు రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ఎలాంటి బిల్లులు చూపకపోవడంతో సీజ్ చేశారు.
- 2024 ఫిబ్రవరి 2న కృష్ణగిరి మండలం అమకతాడు టోల్‌ప్లాజా వద్ద కర్నూలు స్పెషల్ బ్రాంచి పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. హైదరాబాద్ నుంచి కోయంబత్తూరుకు వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సులో అక్రమంగా రవాణా చేస్తున్న రూ.4.59 కోట్ల విలువైన బంగారు, వెండి సహా నగదు సీజ్ చేశారు. పట్టుబడిన వారిలో నంద్యాలకు చెందిన వ్యక్తి ఉన్నాడు.
- 2020 మార్చి నుంచి 2021 జూన్ వరకు పంచలింగాల చెక్‌పోస్టు అప్పటి సెబ్ సీఐ లక్ష్మీదుర్గయ్య రెండేళ్లలో వాహన తనిఖీలు, దాడుల్లో బిల్లులు, ఎలాంటి పత్రాలు లేకుండా అక్రమ రవాణా చేస్తున్న దాదాపు 26 కిలోలు బంగారం, 450 కిలోలకు పైగా వెండి సీజ్ చేసినట్లు పోలీసు రికార్డుల ద్వారా తెలుస్తుంది. తరువాత ఆ స్థాయిలో అక్రమ బంగారం, వెండి రవాణాపై తనిఖీలు, దాడులు, నిఘా కొరవడిందనే ఆరోపణలు ఉన్నాయి.

సంస్కృతిని ప్రతిబింబించే కళలను ఆదరించాలి



సినీ నటుడు, పారిశ్రామికవేత్త బీవీ రెడ్డికి జ్ఞాపిక అందిస్తున్న నృత్య గురువు కరీముల్లా

సినీ నటుడు, పారిశ్రామికవేత్త బీవీ రెడ్డి



వైకుంఠ ఏకాదశి సందర్భంగా 'సప్తగిరుల వైభవం' నృత్య రూపకంలోని కళాకారులు

కర్నూలు కల్చరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే కళలను ఆదరించాలని, ఆదిశగా కృషి చేస్తున్న నటరాజ నృత్య కళామందిరం సేవలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని సినీ నటుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త బీవీ రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కర్నూలులోని నటరాజ నృత్య కళామందిర్, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల జాతీయ స్థాయి శాస్త్రీయ, జానపద నృత్య పోటీలు ఆరంభమయ్యాయి. ఈ పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బీవీ రెడ్డి మాట్లాడుతూ కళలకు ఆదరణ తగ్గుతున్న కాలంలో ఔత్సాహిక కళాకారులు వాటికి ప్రాణం పోస్తున్నారని, ఈ పోటీల్లో పాల్గొనే ప్రతి ఒక్కరూ అభినందనీయులేనని చెప్పారు. ఈ సందర్భంగా బీవీ రెడ్డి నిర్వాహకులకు రూ.10వేలు విరాళం ప్రకటించారు. మరో అతిథి రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య మాట్లాడుతూ నృత్య కళాకారులకు ఇది ఒక మంచి అవకాశమని, ఈ పోటీల ద్వారా తమ ప్రతిభను చాటుకోవాలని కోరారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు విద్వాన్ పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కళాక్షేత్రం ద్వారా ఔత్సాహిక కళాకారులకు శిక్షణ కార్యక్రమాలు ఇస్తున్నామని చెప్పారు. నటరాజ నృత్య కళామందిరం వ్యవస్థాపక నృత్య గురువు ఎస్ కరీముల్లా మాట్లాడుతూ తమ సంస్థ స్థాపించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా 'కళాసౌరభ 10 వార్షికోత్సవం-2025' పేరుతో ఈ నృత్య పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

అలరించిన 'సప్తగిరుల వైభవం' నృత్య రూపకం...

జాతీయ స్థాయి నృత్య పోటీల్లో మొదటి కార్యక్రమంగా, వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రదర్శించిన 'సప్తగిరుల వైభవం' నృత్య రూపకం అసాంతం అలరింపజేసింది. శ్రీవేంకటేశ్వర స్వామి చరిత్రను తెలియజేసే ఈ నృత్య రూపకంలో సుమారు ముప్పయి మందికి పైగా కళాకారులు తమ నృత్యాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. నాట్యాచార్యుడు ఎ.సంతోష్, నృత్య కళామందిర్ ప్రతినిధులు డాక్టర్ బీవీ స్వరూప్‌సిన్హా, కేపీఆర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో ప్రముఖులు



ఆలయ ప్రాంగణంలో మంత్రి, ఎమ్మెల్యే, ఆలయ అధికారులు

శ్రీశైలం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రకాశం జిల్లా గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వీరు ఆలయంలోని రత్నగర్భ గణపతి స్వామిని దర్శించుకుని మల్లికార్జున స్వామివారికి అభిషేకం నిర్వహించుకున్నారు. తరువాత భ్రమరాంబికాదేవి అమ్మవారిని దర్శించుకుని అర్చనలు జరిపించుకున్నారు. దర్శనానంతరం వీరికి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని బహూకరించి, ప్రసాదాలు అందజేశారు.

మహానంది మోడల్ స్కూల్‌కు గ్రీన్ రేట్



ఎం.తిమ్మాపురంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల

మహానంది, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జాతీయ స్థాయిలో నేషనల్ సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ నిర్వహించిన గ్రీన్ స్కూల్ కార్యక్రమం ఆడిట్‌లో మహానంది ఏపీ మెడల్ స్కూల్ గ్రీన్ రేట్ సాధించిందని ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు శుక్రవారం తెలిపారు. మన రాష్ట్రం నుంచి 113 పాఠశాలలు జీఎస్పీ ఆడిట్ సబ్‌మిట్ చేయగా అందులో 16 పాఠశాలలు మాత్రమే గ్రీన్ రేట్ సాధించాయని తెలిపారు. నంద్యాల జిల్లా నుంచి మహానంది ఏపీ మోడల్ స్కూల్ మాత్రమే గ్రీన్‌రేట్ సాధించిందని తెలిపారు. పాఠశాలలో పర్యావరణానికి సంబంధించిన అంశాలకు గుర్తింపు ఇచ్చినట్లు తెలిపారు. వచ్చే నెల 4వ తేదీ ఢిల్లీలో జరిగే జాతీయ జీఎస్పీ కార్నివాల్‌లో గ్రీన్ సర్టిఫికెట్ అందజేస్తారని చెప్పారు. ఈ విజయానికి ఉపాధ్యాయులు, సిబ్బందితో పాటు విద్యార్థుల కృషి ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు.

మహానందిలో 'ముక్కోటి' పూజలు


లక్ష పుష్పాలంకరణలో కోదండరాముల పాలరాతి విగ్రహాలు

మహానంది, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం మహానందిలో వైకుంఠ ఏకాదశి వేడుకలు వైభంగా జరిగాయి. శుక్రవారం తెల్లవారుజామున నాలుగు గంటలకే ఆలయ అర్చకులు వనిపెంట జనార్దన్‌శర్మ, ప్రకాశం శర్మతో పాటు బెక్కెం శరభయ్యశర్మలు సీతారామచంద్ర స్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. కల్యాణ మండపంలో వేదపండితులు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ప్రత్యేక పల్లకిలో ఉత్సవ మూర్తులను మేళ తాళాలతో ఉత్తర ద్వారం వద్దకు తీసుకొచ్చారు. ఏఈఓ ఎర్రమల్ల మధు దంపతులు ద్వారపూజ, తిరుప్పావై సేవల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ఉత్తరద్వారం ద్వారా ధర్శనం కల్పించారు. ఉదయం 10 గంటలకు కోదండరామాలయంలో లక్ష పుష్పార్చన నిర్వహించారు. వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంత్ శర్మ ఆధ్వర్యంలో మూడు గంటల పాటు పుష్పార్చన జరిపారు.


మహానందిలో కోదండరాముల ఊరేగింపు


మహానందిలో ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

ప్రజా ప్రయోజనాలు కాపాడాలి

ఏపీఈఆర్‌సీ చైర్మన్‌కు వామపక్షాల వినతి


ఏపీఈఆర్‌సీ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

కల్లూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఉపసంహరణ, సెకీ ఒప్పందం, సర్దుబాటు, ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని ఏపీఈఆర్‌సీ భవన్‌లో నిర్వహించిన విద్యుత్ టారిఫ్ ప్రజా అభిప్రా య సేకరణ కార్యక్రమానికి నిరసనగా వెళ్లి ఆందోళన చేపట్టారు. విద్యుత్ టారిఫ్ పెంపు, స్మార్ట్ మీటర్లు, ట్రూఅప్, సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని ఏపీఈఆర్‌సీ చైర్మన్, డిస్కంల సీఎండీల సమక్షంలో వామపక్షాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఆదానీ లాభాలకు గ్యారెంటీ ఇవ్వడమే లక్ష్యంగా రాష్ట్రంలో అధికార పార్టీలు పని చేస్తున్నాయని విమర్శించారు. రూ.1750 కోట్ల లంచం తీసుకుని యూనిట్ రూ.2.49 కొనేందుకు గత ప్రభుత్వం ఒప్పందం చేసుకుంటే కూటమి ప్రభుత్వం ఎందుకు విచారణ చేయడం లేదని ప్రశ్నించారు.

● పట్టణపౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ట్రూఅప్ చార్జీలు, స్మార్ట్ మీటర్లు, అవినీతి ఒప్పందాలు రద్దు చేయాలని ఏపీఈఆర్‌సీ భవన్ ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఇ.షుల్లారెడ్డి మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం మాటపై నిలబడాలన్నారు. ఏపీఈఆర్‌సీ చైర్మన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

● విద్యుత్ చార్జీల పెంపుతో స్మాల్‌స్కేల్ ఇండస్ట్రీస్ మూతపడే ప్రమాదం పొంచి ఉందని రైస్‌మిల్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు కె. రామచంద్రారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఏపీఈ ఆర్‌సీ భవన్‌లో చేపట్టిన ప్రజా అభిప్రాయ విచారణలో పాల్గొని విద్యుత్‌చార్జీలు పెంచడం వల్ల చిన్నతరహా పరిశ్రమలు కుదేలవు తున్నాయన్నారు.

● రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజలపై కూటమి ప్రభుత్వం రూ.15432 వేల కోట్ల రూపాయల భారాన్ని మోపిందని సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. అనంతరం ఏపీఈఆర్‌సీ చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు. నాయ కులు మహేష్, శ్రీనివాసరావు, బీసన్న పాల్గొన్నారు.

● ఆదానితో కుదుర్చుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయా లని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. శుక్రవారం దిన్నెదేవరపాడు ఏపీఈఆర్‌సీ భవన్ ముందు విద్యుత్ చార్జీ పెంపును నిరసిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఏపీఈఆర్‌సీ చైర్మన్‌కు వినతిపత్రం అదంజేశారు. కార్యక్రమంలో అఖిల భారత రైతుకూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహులు పాల్గొన్నారు.

● విద్యుత్ పెంపులో శాస్త్రీయత లోపించిందని డాక్టర్ జలీల్ అహమ్మద్ అన్నారు. శుక్రవారం ఏపీఈఆర్‌సీ భవన్‌లో చేపట్టిన ప్రజా అభిప్రాయ విచారణలో పాల్గొన్నారు.

75 ఏళ్ల వేడుక


ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డితో కలిసి ఆహ్వాన పత్రికలు విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

- 12న ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు
- కలుసుకోనున్న పూర్వ విద్యార్థులు
- సిద్ధమైన ఎమ్మిగనూరు పాఠశాల, కళాశాల
- ఏర్పాట్లు చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

ఎమ్మిగనూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి):

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన మరుసటి యేడాది ఏర్పాటైన పాఠశాల అది. ఆ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు దాదాపు 75 ఏళ్ల తర్వాత కలుసుకోనున్నారు. ఈ మహత్తర ఘట్టానికి ఈ నెల 12న ఆ పాఠశాల వేదికగా మారింది. ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను 1948వ సంవత్సరంలో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇదే పాఠశాల ఆవరణలో 23.07.1969లో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ప్రారంభించారు. ఈ ఉన్నత పాఠశాల, కళాశాలలో చదివిన వేలాది మంది విద్యార్థులు విద్యాబుద్ధులు నేర్చుకున్నారు. నేడు వారు పలు రంగాల్లో రాణిస్తున్నారు. మరికొందరు ఉన్నత పదవులు అలంకరించి పదవీ విరమణ పొందారు.

ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవిర్భవించి 77 వసంతాలు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటైన 56 ఏళ్లు పూర్తయింది. దీంతో కళాశాల పూర్వ విద్యార్థులు ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగానే పాఠశాల, కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థుల వివరాలను తెలుసుకొని కమిటీ సభ్యులు ఆహ్వానాలను పంపారు. అలాగే అందుబాటులో ఉన్న కొంతమందికి నేరుగా వెళ్లి ఆహ్వానం పలుకుతున్నారు. పాఠశాల, కళాశాలలో ఇప్పటి వరకు దాదాపు 50-60వేల మంది విద్యార్థులు విద్యాభ్యాసం పూర్తి చేశారు. ఈ విద్యార్థులంతా 75 ఏళ్ల తర్వాత ఈ నెల 12న జరిగే ప్లాటినం జూబ్లీ ఉత్సవాల రోజున కలుసుకొని అవకాశం ఉంది. ఇప్పటికే కమిటీ సభ్యులు ఏ మేరకు పూర్వ విద్యార్థులు హాజరవుతారో ఒక అంచనాకు వచ్చారు. ఇందుకు తగ్గట్టుగానే ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉన్నత స్థానాల్లో ఎంతో మంది

ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, కళాశాలలో చదువుకున్న వారిలో ఎంతో మంది పూర్వ విద్యార్థులు నేడు ప్రభుత్వ ఉన్నత స్థానాల్లో ఉన్నారు. ముఖ్యంగా లోకాయుక్త జడ్జిగా నరసింహారెడ్డి, జిల్లా జడ్జిగా యు.యు. ప్రసాద్, ఆర్డీవో కేడర్‌లో పట్టణానికి చెందిన శారద భాగ్యరేఖ, వెంకటరెడ్డి, ఎర్రకోటకు చెందిన పీడీగా సిద్ధలింగమూర్తిలతోపాటు మరికొంతమంది ఉన్నత పదవుల్లో ఉండి ప్రజలకు సేవలందిస్తున్నారు. అలాగే ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన ఆకుల భరత్‌కుమార్ నాగర్‌కర్నూలు డీఎస్పీగా సేవలందిస్తుండగా, కలుగొట్ల గ్రామానికి చెందిన శ్రీనివాసులు నెల్లూరు డీఎస్పీగాను, గుడికల్లుకు చెందిన వెంకటేశ్వర్లు అనంతపురం డీఎస్పీగా పని చేస్తున్నారు. మరికొంత మంది పోలీసు అధికారులుగా ఉన్నారు. విద్యుత్ బోర్డు డైరెక్టర్‌గా పనిచేసి రిటైర్డ్ అయిన పుల్లారెడ్డి, వ్యవసాయ శాఖ జేడీఏ గా రిటైర్డ్ అయిన వడ్డె నాగన్నతోపాటు పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు గౌడప్పగౌడు, డాక్టర్ శ్రీనివాసులు, పారిశ్రామికవేత్త మాచాని రఘునాథ్, ఎమ్మార్ రమేష్, ఎమ్మార్ గంగాధర్‌లు ఈ విద్యాలయంలోనే విద్యనభ్యసించినవారే. అలాగే రాజకీయం గా వై.రుద్రగౌడు, పాలకుర్తి తిక్కారెడ్డి, ప్రముఖ న్యాయవాది లక్ష్మీనారాయణరెడ్డి, మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు, సోములగూడూరు పార్థసారథిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కుమార్తె ఉమామహేశ్వరిలతోపాటు ఎంతో మంది రాజకీయ, ప్రభుత్వ రంగం, వ్యాపార, పారిశ్రామిక, పత్రిక రంగాలతో పాటు వామపక్ష పార్టీల్లో సైతం ఇక్కడ చదివిన విద్యార్థులు జిల్లా నుంచి రాష్ట్ర పదవులు అలంకరించారు.

ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ముమ్మర ఏర్పాట్లు

ప్లాటినం జూబ్లీ వేడుకలు గుర్తుండిపోయేలా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ముమ్మర ఏర్పాటు చేస్తున్నారు. కమిటీ సభ్యులు ఎం.సి శివకుమార్, మల్లికార్జున, హరినారాయణరెడ్డి, ప్రకాష్‌జైన్, కామలె గణేష్, ఈరన్నగౌడు, జబీర్‌బాషా, వెంకటేష్‌లతోపాటు పలువురు సభ్యులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పాఠశాల, కళాశాలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. అలాగే పాఠశాల ఆవరణలో వేడుకలను నిర్వహించేందుకు ప్రత్యేకంగా వేదికను ఏర్పాటు చేస్తున్నారు.

ఈ నెల 12న కార్యక్రమాలు ఇలా..

ఈనెల 12వ తేదీన ప్లాటీనం జూబ్లీ ఉత్సవాల సందర్భంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వేడుకలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని శివ సర్కిల్ నుంచి సోమప్ప సర్కిల్ మీదుగా విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. అలాగే ఉత్సవాల్లో మొదటగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు ఘన సన్మానం చేయనున్నారు. ఉత్సవాలకు ఎమ్మిగనూరు ప్రాంతం నుండేగాక ఇక్కడ చదివి దేశ విదేశాల్లో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులు దాదాపు 3 నుంచి 5వేల మంది వరకు హాజరయ్యే అవకాశం ఉందని కమిటీ సభ్యులు పేర్కొంటున్నారు.

అందరం కలుసుకోవడం ఎంతో అదృష్టం



ఎన్నో ఏళ్ల క్రితం మాకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను కలుసుకోవడం, నాతోపాటు చదివిన పాత మిత్రులను కలుసుకునే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. ఈ అవకాశం అందరికి రాదు. నాతో పాటు కళాశాలలో చదివి ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. నేను మాత్రం ఇక్కడే ఉంటూ ఈ స్థాయికి ఎదిగి పలువురికి సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకోవడం వరంగా భావిస్తున్నా.

- మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు, పూర్వ విద్యార్థి, సామాజికవేత్త

44 ఏళ్ల తర్వాత కలుసుకోవడం ఆనందంగా ఉంది



స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, కళాశాలల్లో నేను చదువు పూర్తి చేసి 44 ఏళ్లయింది. తిరిగి ఇన్నేళ్ల తర్వాత మళ్లీ అప్పటి మిత్రులను కలుసుకోవడం ఆనందంగా ఉంది. అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకునే అవకాశం మళ్లీ మాకు వచ్చింది. మాకు విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులను కలుసుకొని వారి ఆశీర్వాదం పొందే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నా.

- మామిడి మల్లికార్జున, పూర్వ విద్యార్థి, న్యాయవాది

ఏర్పాట్లు చేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది




ప్లాటినం జూబ్లీ వేడుకలకు ఏర్పాట్లు చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్న. కమిటీ సభ్యులంతా వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను ఐక్యంగా పర్యవేక్షిస్తూ విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నాం. పూర్వ విద్యార్థులతా వేడుకల్లో పాల్గొని గత జ్ఞాపకాలను నెమరవేసుకొని విజయవంతం చేస్తారని ఆశిస్తున్న.

- షఫీఉల్లా, పూర్వ విద్యార్థి, ఎమ్మిగనూరు

జగన్‌ను ప్రజలు తరిమికొడతారు

● కుడా చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి



కర్నూలు అర్బన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): తిరుమల వైకుంఠ ద్వార దర్శనం కోసం టోకెన్ల తొక్కిసలాటలో మృతి చెందిన భక్తుల పట్ల జగన్ వ్యహరించిన తీరు బాధాకరమని, ఆయనను ప్రజలు రాష్ట్రం నుంచి తరిమికొడతారని కుడా చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్, ఆయన చెంచాగాళ్లు భక్తుల పట్ల వ్యవహరించిన తీరును ప్రజలు అసహ్యించుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా చంద్రబాబు పట్ల జగన్ అనుచిత వ్యాఖ్యలు చూస్తుంటే ఆయనకు మతిస్థిమితం లేదని అర్థమవుతోందని అన్నారు. తిరుమలలో జరిగిన ఘటనపై జగన్, కరుణాకర్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి ఇంగితం లేకుండా మాట్లాడటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

అహోబిలం ఆలయ సిబ్బంది సస్పెన్షన్

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 10(ఆంధ్రజ్యోతి): అహోబిలం లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో పని చేస్తున్న ఐదుగురు సిబ్బందిని సస్పెండ్ చేసినట్లు మేనేజర్ మురళీధరన్ తెలిపారు. కొంత మంది ఆలయ సిబ్బంది ఆలయ పరిసరాల్లోని అటవీ ప్రాంతంలో ఈ నెల 8న మద్యం తాగి మాంసం తింటున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడతో ఆలయ నిర్వాహకులు విచారణ చేపట్టారు. ఆలయ నియమాలు పాటించకపోవడం, విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన ఐదుగురు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు మేనేజర్ మురళీధరన్ వెల్లడించారు.

మఠానికి అనుకూల తీర్పు

● నరహరి తీర్థుల ఆరాధన చేసుకోవచ్చన్న ధార్వాడ హైకోర్టు


రాఘవేంద్రస్వామి బృందావనం ముందు తీర్పు పత్రాలను ఉంచి పూజలు చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మధ్వాచార్యుల శిష్యుడు నరహరితీర్థుల ఆరాధన, నిత్య పూజలు మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం చేసుకోవచ్చని కర్ణాటకలోని ధార్వాడ హైకోర్టు బెంచ్ తీర్పు ఇచ్చింది. దీంతో మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు గురువారం రాత్రి తీర్పు తీర్పు ప్రతులను రాఘవేంద్ర స్వామి మూలబృందావనం, ప్రహ్లాదరాయల ముందు వచ్చి పూజలు చేశారు. 1998లో రాఘవేంద్ర స్వామి మఠం నరహరితీర్థుల ఆరాధన చేయరాదని, ఉత్తరాది మఠానికి చెందిన వారికి స్టే ఆర్డర్ వచ్చింది. ఆ తీర్పును రెండో అప్పీల్ ద్వారా మంత్రాలయం మఠం కోర్టును ఆశ్రయించగా.. గురువారం రాఘవేంద్రస్వామి మఠం పూజలు చేసుకోవచ్చని అంగీకరిస్తూ గతంలో ఇచ్చిన స్టే ఆర్డర్‌ను ఎత్తివేసింది. ఇక నుంచి మంత్రాలయం మఠం ఆధ్వర్యంలో నరహరి తీర్థుల బృందావనానికి పూజలు, ఆరాధనోత్సవాలు, శుభకార్యాలు చేసుకోవచ్చని కోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేశ్ జోషీ, శ్రీపతాచార్, అనంతపురాణిక్, మేనేజర్-సీ ఈఈ సురేష్ కోనాపూర్‌లు సంబరాలు చేసుకున్నారు. 27 ఏళ్ల తర్వాత కర్ణాటకలోని హంపి సమీపంలో తుంగభద్ర నది మధ్యలో ఉన్న నరహరితీర్థుల బృందావనానికి మంత్రాలయం మఠం పూజలకు శ్రీకారం చుడుతుందని పీఠాధిపతి తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

డోన్ రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొచ్చెర్వు గ్రామానికి చెందిన రైతు వడ్డె వెంకట నర్సు (30) చికిత్స పొందుతూ మృతి చెందాడు. తనకున్న రెండెకరాల్లో మూడేళ్లుగా వేసుకున్న పంటలో దిగుబడి లేక అప్పులు అధికమయ్యాయి. దీంతో దిక్కుతోచని స్థితిలో ఈ నెల 4వ తేదీన పొలంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి వెళ్లాడు. కుటుంబ సభ్యులు గమనించి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ శుక్రవారం రైతు మృతి చెందాడని డోన్ రూరల్ పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, కూతురు ఉన్నారు.


కర్ణాటకలో సుళేకేరి మహిళ హత్య



కౌతాళం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సుళేకేరి గ్రామానికి చెందిన మహిళ కర్ణాటకలోని మురవళి గ్రామ పొలాల్లో శుక్రవారం దారుణ హత్యకు గురైనది. వివరాలను పరిశీలిస్తే.. సుళేకేరి గ్రామానికి చెందిన కురువ బసమ్మ(52)కు ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామానికి చెందిన కురువ మారెప్పతో వివాహమైంది. వీరికి సంతానం కలగ లేదు. భర్త మారెప్ప కొన్ని సంవత్సరాల క్రితం మృతి చెందాడు. బసమ్మ మూడేళ్లుగా పుట్టిన ఊరిలో ఉంటూ జీవనం కొనసాగిస్తున్నది. గురువారం ఉదయం కర్ణాటకలోని హచ్చొళ్ళిలో ఉచితంగా ఇచ్చే గ్యాస్ సిలిండర్ తెచ్చుకుంటానని గ్రామస్థులకు తెలిపింది. ఈ క్రమంలోనే శుక్రవారం ఉదయం మురవళి గ్రామ పొలాల్లో హత్యకు గురైంది. పొలాల పనులకు వెళుతున్న కూలీలు విగత జీవిగా పడిన ఉన్న మహిళ శవాన్ని గుర్తించి స్థానిక హచ్చోళ్లి పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి దర్యాప్తు చేపట్టగా సాయంత్రం హత్యకు గురైన మహిళ కౌతాళం మండలం సుళేకేరి గ్రామానికి చెందిన కురువ బసమ్మగా గుర్తించారు. కర్ణాటక పోలీసులు స్థానిక కౌతాళం పోలీసుల సహకారంతో సుళేకేరి గ్రామానికి వచ్చి విచారించారు. కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టు మార్టం కోసం సిరుగుప్ప ఆసుపత్రి తరలిస్తున్నట్లు తెలిపారు. హత్యకు గురైన మహిళను ఎవరు హత్య చేశారో, ఎందుకు చేశారో దర్యాప్తు చేసి కేసును త్వరలో ఛేదిస్తామని కర్ణాటక పోలీసులు తెలిపారు.

ఘనంగా మంత్రి టీజీ భరత్ కుమార్తె రిసెప్షన్

● హాజరైన ప్రముఖులు


నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ, సవితమ్మ

కర్నూలు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్, టీజీ శిల్పాభరత్ దంపతుల కుమార్తె శ్రీఆర్యపాణ్య, బొమ్మిడాల వెంకటశ్రీనళిన్ రిసెప్షన్ కార్యక్రమం నగరంలోని ఎస్‌ఏపీ క్యాంప్‌లో శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, కర్నూలు ఎంపీ బస్తాపాటి నాగరాజు, ఈగస్ చీఫ్ ఆకే రవికృష్ణ, కలెక్టరు పి.రంజిత్‌బాషా, జాయింట్ కలెక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు భూమా అఖిలప్రియ, కాల్వ శ్రీనివాసులు, పరిటాల సునీత, డాక్టర్ పల్లె రఘునాథరెడ్డి, ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖరరెడ్డి, బీవీ జయనాగేశ్వరరెడ్డి, పల్లె సింధూరారెడ్డి, కర్నూలు కార్పొరేషన్ కమిషనర్ రవీంద్రబాబు, జడ్పీ సీఈఓ నాసరరెడ్డితో పాటు రాయలసీమ జిల్లాలకు చెందిన పలువురు ప్రముఖులు, టీజీవీ అభిమానులు పెద్దసంఖ్యలో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

యూత్ ఫెస్టివల్ గర్వకారణం

రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



మాట్లాడుతున్న టీజీ వెంకటేశ్

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ యూత్ కల్చరల్ ఫెస్టివల్ కర్నూలులో జరగడం నగరానికే గర్వకారణమని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. టీజీవీ ఫైన్ ఆర్ట్స్ ప్రథమ వార్షికోత్సవం శుక్రవారం స్థానిక నగర శివా రులో ఉన్న మాంటిస్సోరి ఇండస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి టీజీ వెంక టేశ్ హాజరై జాతీయ జెండాను ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి పరిరక్షణ కోసం వివిధ దేశాల నుంచి ప్రతినిధులు రావడం ఆనందంగా ఉందన్నారు. మాంటిస్సోరి విద్యాసంస్థల డైరెక్టర్ రాజశేఖర్, డిల్లీ పార్లమెంటులో మీడియా ఆర్గనైజర్ కీర్తి, గోపాల్, రాజీవ్, గౌరి పాల్గొన్నారు.

భీర లింగేశ్వరస్వామి ఆలయాన్ని పరిశీలించిన మంత్రి


మాట్లాడుతున్న మంత్రి సవిత

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కర్నూలు పెద్దపాడు రోడ్డులోని ఏపీ మోడల్ స్కూల్ సమీపాన గల భీర లింగేశ్వరస్వామి ఆలయాన్ని శుక్రవారం బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో భారీ దేవాలయాన్ని నిర్మించడం గర్వకారణమన్నారు. కర్నూలు జిల్లా కురువ సంఘం కమిటీ సభ్యులను ఆమె అభినందించారు. అలాగే ఆలయ నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తామన్నారు. ఎంపీ నాగరాజు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి రూ.10లక్షలు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కురువ సంఘం అధ్యక్షుడు పత్తికొండ శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి కే. రంగస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు బి.వెంకటేశ్వర్లు, పెద్దపాడు ధనుంజయ, కోశాధికారి కేసీ నాగన్న, మహిళా సంఘం అధ్యక్షురాలు శ్రీలీలా, అనిత, హరిదాసు, రామకృష్ణ పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సంక్షేమానికి కృషి

కర్నూలు అగ్రికల్చర్ జనవరి 10(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామని బీసీ సంక్షేమ చేనేత శాఖ మంత్రి సవిత అన్నారు. శుక్రవారం నగరంలోని అబ్దుల్లాఖాన్ ఎస్టేట్‌లో ఆప్కో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చేనేత వస్త్ర దుకాణాన్ని మంత్రి సవితతోపాటు ఎంపీ బస్తి పాటి నాగరాజు సందర్శించారు. ఈ సందర్భంగా చేనేత వస్త్రాలను పరిశీలించి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీ నాగరాజు వస్త్రాలను కొనుగోలు చేయగా.. మంత్రి సవిత అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించాలన్నారు.

మార్పు బాలకృష్ణమ్మ ఆశయాలను కొనసాగిస్తాం

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేసిన మార్పు బాలకృష్ణమ్మ ఆశయాలను కొనసాగిస్తామని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు అన్నారు. శుక్రవారం డాక్టర్ బ్రహ్మారెడ్డి కాన్ఫరెన్స్ హాలులో జిల్లా గౌరవాధ్యక్షుడు కమలాకర్‌రావు అధ్యక్షతన ఏపీటీఎఫ్ వ్యవస్థాపకుడు మార్పు బాలకృష్ణమ్మ వర్ధంతిని నిర్వహించారు. ముందుగా బాలకృ ష్ణమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హృదయరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం చేపట్టిన అశాస్త్రీయ విధానాలతో ప్రభుత్వ విద్యావ్యవస్థ, ప్రాథమిక విద్యావ్యవస్థ పూర్తిగా విచ్ఛిన్నమైందన్నారు. కూటమి ప్రభుత్వమైనా ఆ తప్పులను సరిదిద్ది ప్రభుత్వ పాఠశాలలను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి విద్యా వ్యవస్థ నూతన జాతీయ విద్యా విధానం అనే అంశంపైన ప్రసంగించారు. ఈసమావేశంలో ఏఐఎఫ్ఈఏ చీఫ్ ప్యాట్రన్ సుబ్బారెడ్డి, ఏపీ టీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇస్మాయిల్, మరియా నందం, పీవీ శేషయ్య, యోగేంద్ర బాబు, స్వామినాథన్ పాల్గొన్నారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే ఆందోళన

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సెలవు దినాల్లో కళాశాలలు, పాఠశాలల్లో తరగతులు నిర్వహించరాదని, అలా నిర్వహిస్తే ఆ విద్యాసంస్థల ముందు ఆందోళన చేస్తామని ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.అబ్బి, అశోక్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

PUBLIC NOTICE

UNDER The instruction of my clint M/s. Shriram FInance Limited, Chennai, Branch at Kurnool, I issue the following notice to general Public. My clintes intends to grant loan to **Smt.Vanaja Bai Rajaputhra, W/o. Sri. Bharadwaj Balkishan Singh, Resident of H.No: 45-142-31-F2, Ramalingeswara Nagar, Road No.1, Kurnool,** by keeping the below mentioned property of him, as security by way of Registered Mortgage.As such if any one have any claim, charges, Mortgages, Sale agreements, court attachments, court disputes etc, shall be informed to the address mentioned below in writing with in 7 days from the date of this notice. Otherwise later objections will not bind on my clint in this regard.

SCHEDULE OF THE PROPERTY

The property is residential house plots bearing Nos. **112 & 113,** in Sy.No.**50-A/1** of **K.Nagalapuram** Village, in a venture in the name of " Sree Manis Royal Homes" with in Sub Registration office of Gudur and Dist Registration office of Kurnool and bounded as follows.

Plot No: 112 : East : Plot No.131, **West** : 30' feet Road, **North** : Plot No.111, **South** : Plot No. 113
Extent : 133.33 Sq.Yards
Plot No: 113 : East : Plot No.130, **West** : 30' feet Road, **North** : Plot No.112, **South** : Plot No. 114
Extent : 133.33 Sq.Yards

Byreddy Venkata Ramana Reddy
Advocate, Kurnool, Cell:94400 79646

సర్పంచ్‌పై ఫిర్యాదు

సి.బెళగల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లలదొడ్డి గ్రామ సర్పంచ్ రామలింగమ్మ పంచాయతీ నిధుల్లో అవినీతికి పాల్పడ్డారని గ్రామస్థులు జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా గ్రామ పెద్ద జగన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రావెల్ రోడ్డు, వీధి దీపాలు, మురుగుకాలువలు చేతిపంపుల మరమ్మతులకు ఖర్చు చేసినట్లు బోగస్ బిల్లులను సృష్టించుకుని ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని జిల్లా పంచా యతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భాస్కరరెడ్డి, చంద్ర, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన వైష్ణవాలయాలు

- నగరంలో ఘనంగా వైకుంఠ ఏకాదశి
- గోదా గోకులంలో భారీగా భక్తజనం
- కిక్కిరిసిన హరిహర క్షేత్రం
- 'ఉత్తర ద్వారం'లో దర్శించుకున్న భక్తులు

కర్నూలు కల్చరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి సందర్భంగా నగరంలో వైష్ణవ ఆలయాలన్నీ భక్తులతో కిక్కిరిశాయి. మామిదాలపాడులోని గోదా గోకుల క్షేత్రంలో గోదా రంగనాథస్వామికి ధనుర్మాస పూజలు నిర్వహించారు. వేకువ జామునే రంగనాథస్వామి వారికి, గోదాదేవి అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శన అవకాశం కల్పించారు. ఈ వేడుకలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. గోదా విష్ణు నిత్య సేవాధామ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

● నగరంలోని సంకల్‌బాగ్ హరిహర క్షేత్రంలోని శ్రీదేవీ భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆలయంలో ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శన అవకాశం కల్పించారు. వేకువ జామున 3 గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీదేవీ, భూదేవి అమ్మవార్లకు ఆలయ అర్చకులు ప్రసన్న శర్మ, మహేష్ శర్మ, గురురాజారావులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, వస్త్రాలంకరణ, పూలంగి సేవలు పూర్తి చేసి, అనంతరం 4 గంటల నుంచీ భక్తులకు దర్శనాలు కల్పించారు. ఈ పూజాది కార్యక్రమాల్లో రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ సతీమణి టీజీ రాజ్యలక్ష్మి, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ సతీమణి టీజీ శిల్పాభరత్, టీజీ వెంకటేశ్ బంధుమిత్రులు ఉత్తర ద్వారం ద్వారా స్వామి అమ్మవార్లను దర్శించి, పూజాలు నిర్వహించారు. విశ్రాంత కలెక్టర్ రాంశంకర్ నాయక్ కుటుంబ సభ్యులు పాల్గొని పూజలు చేశారు. కాగా ఉత్తర ద్వారం దర్శనానికి భక్తులు ఆలయం వెలుపలి రోడ్డు వరకు బారులు తీసి నిలబడ్డారు. సుమారు 20వేల మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సందేల్ చంద్రశేఖర్, కార్యదర్శి చల్లా నాగరాజ శర్మ, గౌరవాధ్యక్షుడు సీహెచ్ దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడు కంచుగంటల శ్యాంసుందర్ రావు, ఉప కార్యదర్శి నాగులవరం రాజశేఖర్, గౌరవ సలహాదారు టీవీ రవిచంద్రశర్మ, ఎస్ శ్రీనివాసరాజు, కృష్ణజ్యోతి, ఆలయ మేనేజర్ రాధాకృష్ణ, ఈసీ మెంబర్లు భక్తులకు సదుపాయాలతోపాటూ తీర్థప్రసాదాలు వితరణ చేశారు. రెండో పట్టణ పోలీసులు ఆలయం వద్ద బందోబస్తు నిర్వహించారు.

● పాతనగరంలో జమ్మిచెట్టు సమీపంలోని లలితాపీఠంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీనివాస కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. లలితా పీఠం పీఠాధిపతి గురు మేడా సుబ్రహ్మణ్యం స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. నెహ్రూనగర్‌లోని పుట్టపర్తి సాయిబాబా మందిరంలో సాయి సేవ సమితి అధ్యక్షుడు మాకా అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశి పూజలు జరిగాయి. బళ్లారి రోడ్డు వైజంక్షన్ సమీపంలోని వాసవీనగర్‌లో గల వేంకటేశ్వర స్వామిదేవాలయంలో వైకుంఠ ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు యాలిశెట్టి భద్రయ్య శెట్టి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. వెంకటరమణ కాలనీలోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఉత్తర ద్వారం ద్వారా స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. కృష్ణనగర్‌లోని శ్రీనివాస మందిరంలో వైకుంఠ ఏకాదశి వేడుకల్లో వందలాదిగా భక్తులు హాజరయ్యారు. పాతనగరంలోని మాలే బాలయ్య సత్రంలో, రామాలయంలో, రాంబొట్ల దేవాలయంలో, బి.క్యాంపులోని విజ్ఞాన మందిరం (శ్రీకృష్ణ మందిరం)లో, పార్కురోడ్డులోని ఇస్కాన్ మందిరంలో, మారుతీనగర్‌లోని శ్రీలక్ష్మీ నరసింహ సీతారామాలయంలో వైకుంఠ ఏకాదశి పూజలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

ఓర్వకల్లు: మండలంలోని కాల్వ, ఉయ్యాలవాడ గ్రామాల్లో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కాల్వ గ్రామంలో భక్తులు ఉత్తర ద్వారం ద్వారా దర్శనం చేసుకున్నారు. అలాగే ఉయ్యాలవాడ గ్రామంలో కొండపై వెలసిన వేంకటేశ్వర స్వామిని భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆల యాల్లో దాతలు అన్నదానం చేశారు.

కోడుమూరు రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. మండలంలోని గోరంట్ల, వర్కూరు గ్రామాల్లో లక్ష్మీమాధవస్వామి ఆలయాల్లో అభిషేకం, హోమం, పుష్పార్చన, కల్యాణం చేపట్టారు. వేకువజామునుంచి భక్తులు ఉత్తర ద్వారంలో వెళ్లి ఆలయ దర్శనం చేసుకున్నారు. గోరంట్ల లక్ష్మీమాధవస్వామి ఆలయంలో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. వర్కూరు లక్ష్మీమాధవస్వామికి కల్యాణం అనంతరం అన్నదానం చేశారు. అలాగే ప్యాలకుర్తి, పులకుర్తి చెన్నకేశవస్వామి ఆలయాలలో భక్తులు పూజలు నిర్వహించారు. ఎస్ఐ శ్రీనివాసులు అధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో గుర్రెడ్డి పాల్గొన్నారు.

గూడూరు: మండలంలోని గ్రామాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయాల్లో భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు.

సి.బెళగల్: మండలంలోని వివిధ ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు.


గోదా గోకులంలో స్వామివారి సేవలో అర్చకులు, ఆలయ పెద్దలు


వాసవీనగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్తర ద్వారం ద్వారా దర్శనం చేసుకుంటున్న భక్తులు


హరిహర క్షేత్రంలో పూజలకు హాజరైన విశ్రాంత కలెక్టర్ రాంశంకర్ నాయక్





కాలువలో వెంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న భక్తులు, గోరంట్లలో క్యూలైన్లలో కిక్కిరిసిన భక్తులు, సి.బెళగల్‌లో..., క్రిష్ణనగర్ వేంకటేశ్వ స్వామి ఆలయంలో మహిళల కోలాటం

ఘనంగా కేవీఆర్ కళాశాల వార్షికోత్సవం


మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కేవీఆర్ బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల 29వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈవేడుకలు ప్రిన్సిపాల్ జి.లాలెప్ప అధ్యక్షతన జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ బస్తిపాటి నాగరాజు హాజరై ప్రసంగించారు. ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులంతా పేద పిల్లలే అని వారి కష్టాలు తనకు తెలుసునని వివరించారు. అదనపు గదుల నిర్మాణానికి తన ఎంపీ నిధుల నుంచి రూ.10లక్షలు ఇస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీవీఈవో పరమేశ్వరరెడ్డి, ఆర్ఐవో గురువయ్యశెట్టి, విద్యాపరిరక్షణ కమిటీ చైర్మన్ మాధవనాయుడు రిటైర్డు ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, చెన్నయ్య, ప్రిన్సిపాల్ సుంకన్న, సరళాదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒకేషనల్ జూనియర్ కాలేజీలో.. బీ క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో శుక్రవారం వార్షికోత్సవం ప్రిన్సిపాల్ నాగ స్వామి నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు హాజరై ప్రసంగించారు. విద్యార్థులకు ఇం టర్ విద్యే కీలకమని, ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చన్నారు. కళాశాలలో మూడు తరగతుల గదుల నిర్మాణానికి పది కంప్యూటర్లను ఎంపీ నిధుల నుంచి మంజూరు చేస్తానని వివరించారు. డీఎస్పీ మహబూబ్ బాషా, విశ్రాంత అధ్యాపకులు డీవీ మాధవరావు, సుజాత ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. గాయత్రీ సేవా సమితి గౌరవాధ్యక్షులు పీఎస్ విజయ కుమార్, రిటైర్డు ప్రిన్సిపాల్ కొట్టె చెన్నయ్య పాల్గొన్నారు.

బ్యాంకు రుణాల కోసం దరఖాస్తు చేసుకోండి

ఓర్వకల్లు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరంలో బీసీ కార్పొరేషన్ ద్వారా బ్యాంకు రుణాల కోసం లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీ, ఈబీసీ, స్వయం ఉపాధి పథకం కింద ఆర్థిక సాయం కోసం మండలానికి 3 కేటగిరీలు, 52 యూనిట్లు బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ 50శాతం బ్యాంకుల ద్వారా రుణం 50 శాతంతో రూ.కోటి దాకా యూనిట్లు మంజూరు చేసిందని తెలిపారు. ఈ యూనిట్లకు సబ్సిడీ రూ.50.25 లక్షలు, బ్యాంకు రుణం రూ.50.25 లక్షలు, మొదటి కేటగిరి కింద రూ.2లక్షల వరకు రెండో కేటగిరీ కింద రూ.2.3లక్షల వరకు, మూడో కేటగిరి రూ.3.5 లక్షలు విలువగా ప్రకటించారన్నారు. కాబట్టి ఆయా కేటగిరిలలో అర్హులైన లబ్ధిదారులు ఆన్‌లైన్ ద్వారా 10 నుంచి 16వ తేదీ వరకు ఓబీఎంఎంఎస్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

ఉపాధి పనుల తనిఖీ

కోడుమూరు రూరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమడగుంట్ల, ఎర్రదొడ్డి గ్రామాల్లో శుక్రవారం ఉపాధి పనులను ఏపీవో మోదీన్‌బాషా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మస్టర్లు తనిఖీ చేసి కూలీల హాజరు సరిపోల్చారు. అనంతరం ఏపీవో మాట్లాడుతూ నిర్ణీత కొలతలు మేరకు పనులు చేసి రూ.300 వేతనం పొందాలని అన్నారు. వలసలు వెళ్లకుండా గ్రామంలోనే కల్పిస్తున్న ఉపాధి పనులు వినియోగించుకోవాలని సూచించారు.

పారిశుధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలి

కర్నూలు న్యూసిటీ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): నగరంలో పారిశుధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని కమిషనర్ ఎస్.రవీం ద్రబాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం తెల్లవారుజామున బళ్లారి చౌరస్తా, నరసింహారెడ్డినగర్, రోజా వీధి, పాత ఈద్గా, సంపత్ నగర్, గాంధీనగర్, పాత కంట్రోల్ రూం తదితర ప్రాంతాలలో కమి షనర్ పర్యటించారు. ప్రతి రెండు వారాలకోసారి తప్పనిసరిగ్గా పూడికతీత పనులు చేపట్టాలని అన్నారు. అనంతరం వాటి వ్యర్థాలను డంప్ యార్డుకు తరలించా లని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య అధికారి కే.విశ్వేశ్వరరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ముర్తుజావలి, మునిస్వామి, అనిల్‌గౌడు పాల్గొన్నారు.

బాలికల క్రికెట్ జట్టుకు డీఈవో అభినందన

కర్నూలు స్పోర్ట్స్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా నాగార్జున యూనివర్సిటీలో ఈనెల 6, 7, 8 తేదీల్లో జరిగిన ఎస్‌జీ ఎఫ్ అండర్-17 బాలికల జట్టు విజయం సాధించింది. శుక్రవారం డీఈవో శ్యామ్యూల్ పాల్ జట్టును అభినందించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుంద న్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ గిడ్డయ్య, ఉపాధ్యాయులు, క్రీడాకారులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతు పనుల్లో భాగంగా రెండో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు టౌన్ ఈఈ టి.శేషాద్రి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9గంటల నుంచి 2 గంటల వరకు కర్నూలు, కల్లూరు మండలంలో కరెంట్ సరఫరాలో అంతరా యం ఉంటుందని ఏడీఈలు నాగప్రసాద్, రాజేంద్రబాబు, సుబ్బన్న తెలిపారు. ప్రజలు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

స్వచ్ఛాంధ్ర క్లాప్ ఆటోలను కొనసాగించాలి

కర్నూలు న్యూసిటీ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): నగర పాలక పరిధిలో స్వచ్ఛాంధ్ర క్లాప్ ఆటోలను కొనసాగించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం నగర పాలక కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె కాలపు జీవోలను అమలు చేయాలని, క్లాప్ ఆటోలను కొనసాగించాలని, వారికి పని భద్రత కల్పించాలని, డ్రైవర్లకు 7 నెలల పెండింగ్ జీతాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో క్లాప్ డ్రైవర్ల కార్యదర్శి రఘుశేఖర్, సీఐటీయూ నాయకులు మారెళ్ళ విజయరామాంజ నేయులు, అబ్దుల్ దేశాయ్, మైమూద్, కుమార్ పాల్గొన్నారు.

ఫర్టిలైజర్స్ దుకాణాల తనిఖీ

కోడుమూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): వెంకటేశ్వర, లక్ష్మీ ఫర్టిలైజర్స్ దుకాణాలను వ్యవసాయ డీఆర్‌సీ ఏడీఏ వెంకటేశ్వరరెడ్డి కర్నూలు డివిజన్ ఏడీఏ సాలురెడ్డి, ఏవో రవిప్రకాష్ శుక్రవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ లైసెన్సుదారులు స్టాక్ బుక్‌లో ప్రతి రోజు సరుకును విక్రయాలు ఎంట్రీ చేయాలన్నారు. షాపు ముందు భాగం లో స్టాక్ బోర్డులో స్టాక్, ఎమ్మార్పీ పట్టిక ఖచ్చితంగా రైతులకు కనిపించే విధంగా ఉండాలన్నారు.

కడపలోనే కొనసాగించాలి

కర్నూలు న్యూసిటీ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించా లని ఆర్పీల సంఘం జిల్లా కార్యదర్శి ఉమాదేవి డిమాండ్ చేశారు. శుక్రవారం లక్ష్మీనగర్‌లో మెప్మా ఆర్పీల సంఘం, పొదుపు లక్ష్మీ గ్రూపుల సమన్వయ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ కడపలో ఉన్న ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని తరలించడం అన్యాయమన్నారు. ఈసమావేశంలో ఏపీజీబీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరెడ్డి, సీఐటీయూ నాయకులు వి.వెంకటేశ్వర్లు, వి.రాధిక, హైమావతి, సరిత, లీలావతి పాల్గొన్నారు.

ఫార్మసీ ఆఫీసర్లకు పదోన్నతి ఇవ్వాలి

కర్నూలు హాస్పిటల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఫార్మసీ ఆఫీసర్లకు పదోన్నతి కల్పించాలని ఏపీఎన్జీవో జిల్లా చైర్మన్ వీసీహెచ్ వెంగళ్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఫార్మసిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రంగస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని ట్రెజరీ ఆఫీసులో నూతన క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో ఇన్‌చార్జి జిల్లా కార్యదర్శి కృష్ణుడు, కర్నూలు నగర అధ్యక్షుడు ఎంసీ కాశన్న, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ఫార్మసీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రాజేష్ పాల్గొన్నారు.

గోకులాల నిర్మాణాన్ని పూర్తి చేయండి


ఓర్వకల్లు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీల్లో భాగంగా మంజూరైన గోకులం షెడ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండలంలోని హుశేనాపురంలో జరిగిన గోకులం షెడ్లను ఆయనతో పాటు ఏపీడీ లక్ష్మన్న పరిశీలించారు. ఉపాధి హామీ పథకం కింద రూ.2.30 లక్షలతో చేపట్టిన గోకులం షెడ్ల పనులను ఆయన పరిశీలించారు. ఏపీవో కుమార సాయినాథ్, టెక్నికల్ అసిస్టెంట్ శేఖర్, ఫీల్డ్ అసి స్టెంట్లు శ్రీనివాసులు, కాల్వబుగ్గ మాజీ చైర్మన్ చంద్ర పెద్దస్వామి పాల్గొన్నారు.

న్యాయ శాఖ మహిళా సిబ్బందికి ముగ్గుల పోటీలు


ముగ్గులను పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ది

కర్నూలు లీగల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ పురస్కరించుకుని స్థానిక జిల్లా కోర్టు ఆవరణంలో న్యాయ శాఖ మహిళా సిబ్బందికి శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. న్యాయాధికారుల సతీమణులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ పోటీలను జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముగ్గుల పోటీలు మన తెలు గు సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయన్నారు. కార్యక్రమంలో న్యాయాధికారులు పాండురంగారెడ్డి, భూపాల్ రెడ్డి, లీలా వెంకట శేషాద్రి, సరోజనమ్మ పాల్గొన్నారు.

పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలి: సీపీఐ


ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు రూరల్ జనవరి 10(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలో రెండేళ్ల నుంచి గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు గుడిసెలు వేసుకున్న పేదలతో కలిసి శుక్రవారం కర్నూలు అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈసందర్భంగా మునెప్ప మాట్లాడుతూ పేదలు నివసించే ప్రాంతాల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువలు, విద్యుత్, మంచినీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి మాట్లా డుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పేదలకు రెండు సెంట్ల స్థలం ఇచ్చి అందులో ఇళ్ల నిర్మాణం కోసం రూ.పట్టణాల్లో రూ.లక్షల రూపాయలు ఇస్తామని మాట ఇచ్చిందని, ఆ హామీని నేటికి కూడా పట్టించుకోలేదన్నారు. అనంతరం కార్యలయం సీనియర్ అధికారి నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు భీసన్న, నల్లన్న, జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్‌యాదవ్, నగర సహాయ కార్యదర్శులు చంద్రశేఖర్, డి.శ్రీనివా సులు, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, నగర అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాటం

గూడూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాడతామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నబిరసూల్ అన్నారు. శుక్రవారం గూడూరులోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి కృష్ణ, నియోజక వర్గ కార్య దర్శి శేషు కుమార్, సీపీఐ మండల కార్యదర్శి బీడీల శ్రీనివాసులు పాల్గొన్నారు.

యాప్‌ల భారం తగ్గించాలి

కర్నూలు హాస్పిటల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): క్షేత్ర స్థాయిలో పని చేసే ఆరోగ్య కార్యకర్తలకు యాప్‌ల భారాన్ని తగ్గించాలని ఏపీ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం (ఐఎన్‌టీయూసీ 3194) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంసి. నరసింహులు, ఎన్‌డీ సంపత్ కుమార్, డీఎంహెచ్‌వోను కోరారు. శుక్రవారం రాత్రి యూనియన్ న్యూఇయర్ క్యాలెండర్‌ను డీఎంహెచ్‌వో పి.శాంతి కళ ఆవిష్కరించారు. సంఘం జిల్లా కోశాధికారి సాయిరాం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈ.బాల కృష్ణుడు, కే.సురేష్‌బాబు, డీఐవో డా.నాగప్రసాద్, ఆఫీసు ఏవో కే. అరుణ పాల్గొన్నారు.

కురువలకు న్యాయం చేయాలి

మద్దికెర, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మాదాసి, మాదారి కురువలకు న్యాయం చేయాలని మాజీ సర్పంచ్ గంపల వెంకటేశ్వర్లు, మాదాసి మాదారి కురువ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బొంబాయి సుధాకర్ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ హుశేన్‌సాహెబ్‌కు వినతి పత్రం అందజేశారు. జీవో.3, 150ని పరిగణనలోకి తీసుకుంటే కురువలే మాదాసి, మాదారి కురువలని జీవో ద్వారా అర్థం అవుతుందన్నారు. మాదాసి, మాదారి కురువలకు ఎస్సీ జాబితాలో భాగంగా ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కురువ సంఘం నాయకులు గోపాల్, వీరేష్, ఫక్కీరప్ప, గడ్డం రమేష్, ఈశ్వరయ్య ఆదివారాయణ, మల్లికార్జున, కోదండరాముడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలి

మద్దికెర, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, మాజీ జడ్పీటీసీ సభ్యులు వరలక్ష్మి అన్నారు. శుక్రవారం వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని మండలంలోని పెరవలి గ్రామంలో ఎంతో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథస్వామిని ఉత్తర ద్వార దర్శనం ద్వారా దర్శించుకున్నారు. ఆలయ ఈవో వీరయ్య తుగ్గలి నాగేంద్ర దంపతులతో ప్రత్యేక పూజలు చేయించి అనంతరం శాలువాతో సన్మానించి స్వామివారి తీర్థప్రసాదాలు, క్యాలెండర్‌ను అందజేశారు. కార్యక్రమంలో తాలుకా తెలుగు యువత అధ్యక్షులు ఈడగ చంద్రశేఖర్ గౌడు, ఎన్.లక్ష్మీనారాయణ, టైలర్ రవి, పలువురు ఉన్నారు.

విస్తరణ పనుల తర్వాత లైనింగ్ పనులు చేపట్టాలి

దేవనకొండ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా ప్రధాన కాలువ విస్తరణ పనులు ముగిసిన తర్వాతనే లైనింగ్ పనులు చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు వీరశేకర్ అన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం హంద్రీనీవా కాలువ సామర్థ్యం పెంచేందుకు అనుమతులు ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుతం ఉన్న కాలువకు లైనింగ్ పనులు చేస్తే అనంతరం కాలువ విస్తరణకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. కాలువ కొన్ని చోట్ల ప్రమాదకరంగా ఉందన్నారు. హంద్రీనీవా నీటి వాటా 40 టీఎంసీలుగా ఉందని, దానిని 100 టీఎంసీలకు పెంచాలని, అవిధంగా కాలువ సామర్థ్యం పెంచిన అనంతరమే కాలువకు లైనింగ్ పనులు చేపట్టాలంటూ దేవనకొండ తహసీల్దార్ లోకేశ్వరయ్యకు వినతిపత్రం ఇచ్చారు. ఆశోక్, బాషా, నాగేంద్ర,నాగేష్, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

ఆదోని రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆదోని భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అజయ్ బాబు డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఆయన మాట్లాడుతూ ఆదోనిలో రోజురోజుకు భూకబ్జాదారులు ఎక్కువయ్యారన్నారు. అర్హులైన ప్రతి పేదవారికి గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల చొప్పున ఇంటి స్థలం కేటాయించాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ గుండాల నాయక్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో కల్లుబావి రాజు, సుదర్శన్, సత్యనారాయణ, విజయ్, లక్ష్మీ నారాయణ, నాగేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కూటమితోనే గ్రామాభివృద్ధి



రాంపల్లిలో గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న దృశ్యం

తుగ్గలి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయు డు, సర్పంచులు సుజా త, ఓబులేసు, రామచంద్రుడు అన్నారు. శుక్రవా రం మండలంలోని ముక్కెల్ల, రాంపురం, శభాష్‌పురం, బీసీ కొండ, జొన్నగిరి, పీసీ కొండ తదితర గ్రామాల్లో నిర్మించిన గోకులాల షెడ్లు, సీసీ రోడ్లు, మురికి కాలువల పనులకు ఎంపీడీవో విశ్వమోహన్, ఏపీవో హేమసుందర్‌లతో పాటు టీడీపీ నాయకులు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టారని అన్నారు. కార్యక్రమంలో ఈసీ ప్రదీప్, బాలన్న, మిద్దె రవికుమార్, లక్ష్మణస్వామి, ఆదినారాయణ, మోహన్, శ్రీను నాయక్, అంజి, పులికొండ, జయచంద్ర, రాంపల్లి శ్రీను, హేమాద్రి నాయుడు పాల్గొన్నారు.

గోకులం షెడ్లతో పశువుల రక్షణ

● ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్



ఆలూరు గోకులం షెడ్‌ను ప్రారంభిస్తున్న వీరభద్ర గౌడ్

ఆలూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : పశువుల సంరక్షణ కోసం ప్రభుత్వం గోకులం షెడ్లను ఏర్పాటు చేస్తుందని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జీ వీరభద్ర గౌడ్ అన్నారు. శుక్రవారం స్థానిక ఇందిరా నగర్‌లో గోకుల షెడ్‌ను ఆయన పారంభించారు. కార్యక్రమంలో సీఎల్ఆర్‌సీ కోర్స్ డైరెక్టర్ సురేష్ బాబు, ఏపీవో శ్రీనివాసులు, టీపీ ఉలిగప్ప, టీడీపీ మండల కన్వీనర్ అశోక్, నరసప్ప, త్యాగ రాజు, కొమ్ము రాజు, రాము యాదవ్, వన్నూరు వల్లి, అరికెర ఈరన్న, గుండయ్య, గోవింద్, హనుమప్పా, బోయ వీరేష్, లింగప్ప పాల్గొన్నారు.

దేవనకొండ: రైతులు ఆర్థికంగా వృద్ధి చెందేలా గోకులం షెడ్ల నిర్మాణాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని పశుసంవర్థశాఖ డిప్యూటీ డైరక్టర్ డాక్టర్ దుర్గ ప్రసన్నబాబు, ఏడీ వెంకటేశ్వర్లు, ఏన్‌ఆర్‌జీఎస్ ఏపీడీ పక్కీరప్ప, టీడీపీ జిల్లా కార్యదర్శివర్గసభ్యులు రాందాస్‌గౌడ్ అన్నారు. మండలంలోని గుండ్లకొండలో నలుగురు రైతులు నిర్మించిన గోకులం షెడ్లని శుక్రవారం ప్రారంభించారు.ఏపీవో కృష్ణమూర్తి, వెలమకూరు విఎఎస్ వెంకటేష్ , జెవివో శివనారాయణరెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన

ఆదోని టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీలోని వివిధ శాఖల్లో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్‌లుగా పని చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని మున్సిపల్ ఇంజనీరింగ్ వర్క్‌ర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈరన్న, అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన్న, పీఎస్ గోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్మిక నాయకులు పీర, అహ్మద్, సోమన్న మాట్లాడుతూ కార్మికులకు రూ.28వేలు జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కర్రెప్ప, ముని, శివ, శివకుమార్, బాషా, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

పత్తికొండ, జనవరి10 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ పట్టణం ఆదోని రహదారిలో అయ్యప్పకాంప్లెక్స్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ముందు వెళ్తున్న ఆటోను మోటార్‌సైకిల్ ఢీకొట్టడంతో పట్టణానికి చెందిన వినోద్, శ్రీకాంత్‌లు తీవ్రంగా గాయపడ్డారు. 108 అంబులెన్స్‌లో ఇద్దరిని పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్సకోసం ఇద్దరిని కర్నూలుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మద్దికెరలో స్వామి, అమ్మవార్ల ఊరేగింపు



ఆదోని కోట వెంకటేశ్వర స్వామి ఆలయంలో దర్శనం కోసం బారులు దీరిన భక్తులు

ఘనంగా వైకుంఠ ఏకాదశి

జిల్లాలో వైకుంఠ ఏకాదశి వేడుకను భక్తులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. వైష్ణవ ఆలయాలను ప్రత్యేక అలంకరణలో తీర్చిదిద్దారు. అలంకార ప్రియుడైన విష్ణుమూర్తిని, లక్ష్మీ దేవి, గోదాదేవి అమ్మవార్ల మూల మూర్తులను, ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించారు. ఆలయాల్లో స్వామి వారి దర్శనానికి ప్రత్యేకంగా 'ఉత్తర ద్వారాల'ను అరటి బోదెలు, మామిడి తోరణాలు, పుష్ప మాలలతో తీర్చిదిద్ది ఆ ద్వారం ద్వారా భక్తులకు దర్శన సదుపాయాలు కల్పించారు. వైకుంఠ ఏకాదశి పర్వదిన సందర్భంగా ఆయా ఆలయాల్లో వేకువజాము నుంచే స్వామివారికి, అమ్మవార్లకు అభిషేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శన అవకాశం కల్పించారు భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. వివిధ ప్రాంతాల్లోని ఆలయాల వద్ద భక్తుల కోసం క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు.



ఆదోని తిరుమల నగర్ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో..



మద్దికెరలో ఉత్తర ద్వారంలో దర్శనమిస్తున్న రంగనాథస్వామి



పత్తికొండలో ..



అస్పరి: అలిగేరలో స్వామివారిని పల్లకిలో తీసుకెళ్తున్న భక్తులు



ఆదోని తిరుమల నగర్‌లో ప్రత్యేక అలంకరణలో వెంకటేశ్వరస్వామి



కబ్జా చేసినట్లు నిరూపిస్తే..

రాజకీయాల నుంచి తప్పుకుంటా

● మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

ఆదోని అగ్రికల్చర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : తాను భూములను కబ్జాలు చేసినట్లు ఎమ్మెల్యే పార్థసారథి ఆధారాలు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి అన్నారు. శుక్రవారం తన నివాసంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే తాను కొన్ని సర్వే నెంబర్లలో ఉన్న భూములను కబ్జా చేశానని తప్పుడు ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇందులో ఏ ఒక్క ఆధారమైన మీ దగ్గర ఉంటే బయట పెట్టాలంటూ సవాల్ విసిరారు. ఎన్నికలకు ముందు కబ్జా చేస్తే తోలు తీస్తా అని పదేపదే అన్న మీరు.. మీ ముఖ్య అనుచరుడు డాక్టర్ రవి కిరణ్ ఆధార్ కార్డు మార్పు చేసి రూ. కోట్ల విలువచేసే భూమిని రిజిస్ట్రేషన్ చేసుకోలేదా అంటూ ప్రశ్నించారు. పదేపదే నా పేరు జపం చేస్తూ చిట్టా విప్పుతా అనడం కాదు... చిట్టా విప్పి మాట్లాడాలని అన్నారు. అభివృద్ధిపై దృష్టి సారించకుండా ప్రజలను పక్కదారి పట్టించే విధంగా మాట్లాడొద్దన్నారు. బైపాస్ రోడ్, మెడికల్ కళాశాల, షాపింగ్ మాల్ నిర్మాణాలను పూర్తి చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. ఇప్పటికైనా పసలేని మాటలు మాట్లాడడం మానేయాలని హితవు పలికారు. సమావేశంలో వైసీపీ నాయకులు చంద్రకాంత్ రెడ్డి, వైస్ చైర్మన్ నరసింహులు కౌన్సిలరులు ఫయాజ్, మధు, నాగరాజు పాల్గొన్నారు.

న్యాయం చేయండి సారు...



సబ్ కలెక్టర్‌తో మాట్లాడుతున్న మహిళా రైతు

హొళగుంద, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : హొళగుంద గ్రామానికి చెందిన బోయ మారెమ్మ అనే మహిళా రైతుకు చెందిన సర్వే నెంబరు 365 సీబీసీలో 1.52 సెంట్ల భూమిని రెవెన్యూ అధికారులు మరో వ్యక్తి పేరుపై మార్చారు. బాధితురాలు ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ దృష్టికి తీసుకువెళ్లగా శుక్రవారం ఆయన విచారణ చేపట్టారు. దీంతో మహిళా రైతు సబ్ కలెక్టర్‌తో మాట్లాడుతూ 50ఏళ్లకుపైగా సాగులో ఉన్న భూమి లక్షల్లో విలువ చేస్తుండడంతో కొందరు అక్రమార్కులు రెవెన్యూ అధికారులతో చేతులు కలిపి తమకు తెలియకుండా నెల రోజుల క్రితం తమ పేరుపై ఉన్న పొలాన్ని నాగరాజు అనే వ్యక్తి పేరుపై ఆన్‌లైన్‌లో నమోదు చేశారని అన్నారు. తనకు ముగ్గురు కూతుర్లు ఉన్నారని, తమకు న్యాయం చేయాలని కన్నీటి పర్యంతం అయ్యారు. విచారణ చేసి న్యాయం చేస్తానని సబ్‌కలెక్టర్ హామీ ఇచ్చారు. సంబంధిత పొలాన్ని సందర్శించి తహసీల్దార్ సతీష్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ సతీష్‌ను వివరణ కోరగా రైతుల నుంచి రికార్డులు ప్రకారం మ్యూటేషన్ చేశామని, బాధితుల నుంచి వివరణ తీసుకొని మహిళా రైతుకు న్యాయం చేస్తామని తెలిపారు.

బాలయేసు మహోత్సవాలు ప్రారంభం



ఉత్సవాలకు ముస్తాబైన చర్చి

మద్దికెర, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మద్దికెరలోని మెయిన్‌బజారులో ఉన్న 144 ఏళ్ల చరిత్రగల రోమన్ క్యాథిక్ చర్చిలో బాలయేసు మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు 15వ తేదీ వరకు జరుగుతున్నాయని చర్చి నిర్వాహకులు గురుశ్రీ అంథోని, జేవీఆర్ తెలిపారు. 15 వరకు ప్రతి రోజు సాయంత్రం జెండా ప్రతిష్ఠ, జపమాల నవదిన ప్రార్థనలు, దివ్యబలి పూజ ఉంటుందన్నారు. అలాగే 14న ఉదయం 10 గంటలకు మత పెద్దలు గోరంట్ల జాన్వేస్, ఇతర గురువులచే సమష్టి దివ్యబలిపూజ నిర్వహిస్తామని తెలిపారు.

బీసీలకు రుణాలు మంజూరు

తుగ్గలి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : బీసీ యాక్షన్ ప్లాన్ కింద మండలానికి బీసీలకు రుణాలు మంజూరయ్యాయని ఎంపీడీవో విశ్వమోహన్ అన్నారు. శుక్రవారం తుగ్గలి ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి బీసీ యాక్షన్ ప్లాన్ కింద మండలానికి 50 స్వయంఉపాధి యూనిట్లు మంజూరయ్యాయనీ అన్నారు. ఇందులో బీసీ-ఏకి 21, బీసీ-బీకి 12, బీసీ-డీకి 7, బీసీ-ఈకి 10 యూనిట్లు కేటాయించినట్లు తెలిపారు. బ్యాంకుల వారీగా తుగ్గలి ఏపీజీబీ బ్యాంకుకు 21 యూనిట్లు, జొన్నగిరి ఏపీజీబీకి 14 యూనిట్లు, ఆర్ఎస్ పెండేకల్ ఎస్‌బీఐకి 15 యూనిట్లు ఆ బ్యాంకుల పరిధిలో మంజూరయ్యాయన్నారు. ఈ రుణాలు తీసుకున్న లబ్ధిదారులకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ ఇస్తుందని, 21 సంవత్సరాలు నుంచి 60 ఏళ్లలోపు ఉన్న అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి

పత్తికొండ టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పెంచిన కరెంటు చార్జీలను వెంటనే రద్దు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి వెంకటేశ్వర రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఈశ్వర్ రెడ్డి భవన్ నుంచి సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యకర్తలు పట్టణ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహిస్తూ విద్యుత్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంటు చార్జీల పెంచబోమని చెప్పిన పాలక ప్రభుత్వ పెద్దలు అధికారంలోకి వచ్చి 6 నెలలకే చార్జీలు పెంచడం దారుణమన్నారు. పెంచిన చార్జీలను తగ్గించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం విద్యుత్ శాఖ ట్రాన్స్‌కో ఏఈ నారాయణస్వామికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు రంగారెడ్డి, దస్తగిరి, నాయకులు రామాంజనేయులు, గంగన్న, ఎస్ఎఫ్ఐ నాయకులు రంజిత్, వివేక్, ప్రజానాట్య మండలి నాయకులు రమేష్ పాల్గొన్నారు.

తిరుపతి ఘటనపై న్యాయ విచారణ జరిపించాలి

ఆలూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి దేవస్థానంలో తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందడం బాధాకరమని, జరిగిన ఘటనపై న్యాయ విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆలూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చిప్పగిరి లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ కమిటీ తరపున ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడం ఘటనకు కారణం అన్నారు. మృతుల కుంటుబాలకు రూ.1కోటి ఇవ్వాలన్నారు.

అన్న క్యాంటీన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

ఆలూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఆలూరు పట్టణంలోని ప్రకాశం పార్క్‌లో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రకాశం పార్క్‌లో స్థలాన్ని పరిశీలించారు. వెనుకబడిన ఆలూరు ప్రాంతంలో అత్యధికంగా కార్మికులు ఉన్నారని ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మంజూరు అయ్యేలా చూస్తామన్నారు...

'రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి'

వెల్దుర్తి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య చేసుకున్న వలస కార్మికుడు దూర్జన్ బెహరా కుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నగేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇటుకల బట్టీ యజమానులు లేబర్ చట్టాలను అతిక్రమించి వలస కార్మికులతో శ్రమదోపిడీకి పాల్పడుతున్నారన్నారు. కార్మికుల శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఆర్థిక సాయం అందజేత

వెల్దుర్తి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి జిల్లాపరిషత్ హైస్కూల్ 1988-89 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన స్నేహితురాలు రాజేశ్వరి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. స్నేహితురాలు శుక్రవారం ఇంటికి వెళ్లి ఆమె కుమారుడు మనోజ్‌కు రూ.10 వేలు సాయం అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వండి



పత్తికొండ ధర్నాలో మాట్లాడుతున్న గిడ్డయ్య

పత్తికొండ టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని, లేకుంటే ప్రభుత్వ భూముల్లో ఎర్రజెండాలు పాతి పేదలకు ఇంటి స్థలాలు పంచుతామని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం స్థానిక సీఆర్ భవన్ నుంచి సీపీఐ ఆధ్వర్యంలో ఇల్లు లేని నిరుపేదలు, పట్టణ పురవీదుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నాయకులు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3సెంట్లు పేదలకు ఇంటి స్థలాలు కేటాయించి పక్కా గృహాలు కట్టించి ఇస్తామని చెప్పారని, అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఒక సెంటు స్థలం ఇచ్చిన దాఖలాలు లేవని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేకుంటే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహేబ్, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా సమితి సభ్యులు గురుదాసు, తిమ్మయ్య, కారన్న, వీరన్న, ప్రజా సంఘాల నాయకులు రంగన్న, గిడ్డయ్య, రాజప్ప,సిద్దు, సిద్దలింగప్ప, నెట్టికంటయ్య, ఉపేంద్ర పాల్గొన్నారు.

తుగ్గలి: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణాల బిల్లులు వెంటనే అందించాలని సీపీఐ మండల కార్యదర్శి సుల్తాన్ డిమాండ్ చేశారు. శుక్రవారం తుగ్గలి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ప్రకారం పట్టణంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చి వాటి నిర్మాణ కోసం రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు లబ్ధిదారులు ఉన్నారు.

దేవనకొండ: నిరుపేదలకు ఇళ్లు, స్థలాలు ఇవ్వాలంటూ సీపీఐ అధ్వర్యంలో ధర్నా చేశారు. సీపీఐ మండల కార్యదర్శి నర్సారావ్ మాట్లాడుతూ అర్హులైన పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణల్లో రెండు సెంట్లు కేటాయించి, ఇంటి నిర్మాణాలకు రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ,తహసీల్దార్ లోకేశ్వరయ్యకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ, బీకెఎంయూ, వ్యవసాయ కార్మికసంఘం నాయకులు కృష్ణ, హరికృష్ణ,తిమ్మప్ప,నరసింహులు, బాషా, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మద్దికెర: మండలంలోని ఆయా గ్రామాల్లో నిరుపేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇవ్వాలని మండల సీపీఐ కార్యదర్శి నాగరాజు, మండల రైతు సంఘం అధ్యక్షులు మదనంతపురం హనుమన్న డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం వినతి పత్రాన్ని వీఆర్వో రంగస్వామికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కోదండరాముడు, శ్రీకాంత్, రామాంజులు, నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఆలూరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణంలో2 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆలూరు తహసీలార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ గోవిందు సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాక భూపేశ్, సీపీఐ మండల కార్యదర్శి రామాంజినేయులు, నాయకులు రంగన్న, గోపాల్, సిద్ద లింగ, దుర్గప్ప, జాఫర్, ప్రభావతి, మంగమ్మ, ఫాతిమా పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు ఇచ్చే వరకు పోరాటం



ధర్నా చేస్తున్న సీపీఐ, బీకేఎంయూ నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఇంటి స్థలాలు ఇచ్చే వరకు పోరాటం చేస్తామని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, సహాయ కార్యదర్శి సమీఉల్లా, రైతు సంఘం జిల్లా నాయకులు జబ్బార్ అన్నారు. శుక్రవారం సీపీఐ, బీకేఎంయూ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి సోమప్ప సర్కిల్ మీదుగా భారీ ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం డీటీ వీరేంద్రగౌడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు గ్రామీణ ప్రాంతంలోని పేదలకు మూడు సెంట్లు, పట్టణంలోని పేదలకు రెండు సెంట్ల చొప్పున ఇంటి స్థలాలను కేటాయించాలన్నారు. ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు. ఇంటి స్థలాలు కేటాయించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య పట్టణ అధ్యక్షురాలు ఈరమ్మ, వాణి, సీపీఐ నాయకులు తిమ్మగురుడు, దాదావలి, విరుపాక్షి, విజయేంద్ర, రాజీవ్, మాలిక్, మల్లికార్జున, ఖాజా, రవి, నరసింహగౌడు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి



అధికారులకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

పెద్దకడుబూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఇళ్ల స్థలాలులేని పేదలను గుర్తించి ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు నిర్మాణాలు చేపట్టాలని సీపీఐ మండల కార్యదర్శి వీరేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్దకడుబూరులోని తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దకడుబూరు మండలంలో ఎంతో మంది పేదలకు ఇంటి స్థలాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదనవ్యక్తం చేశారు. ఇంటి స్థలాలు లేనివారందరికీ మూడు సెంట్ల స్థలం ఇవ్వడంతో పాటు ఇంటిని నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ రూ.1.80లక్షలు ఇంటి పునాదులకే సరిపోవన్నారు. ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇస్తామని ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. అనంతరం రెవెన్యూ సిబ్బంది నరసన్నకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జాఫర్ పటేల్, తిక్కన్న, హనుమంతు, నరసింహులు, రాజగోపాల్, రామాంజనేయులు, గిడ్డయ్య, దస్తగిరి పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి: ఎంపీడీవో



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

నందవరం, జనవరి10(ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్డు, డ్రైనేజీ పనుల్లో నాణ్యత పాటించాలని ఎంపీడీవో వుల్లయ్య సూచించారు. శుక్రవారం జగ్గాపురం గ్రామంలో సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పనులను నాసిరకంగా చేస్తే సహించేది లేదని కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. అనంతరం సచివాలయాన్ని తనిఖీ చేశారు. సర్వేలు, పథకాల పురోగతి గురించి సమీక్ష నిర్వహించారు. అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. వచ్చే వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా పంచాయతీ కార్యదర్శి, గ్రామ పెద్దలు, టీడీపీ నాయకులతో చర్చించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాజీ ఎంపీటీసీ లక్ష్మీదేవి, గడంగం నరసింహులు, గట్టాల రంగన్న, తిమ్మప్ప, ఎల్ఐసీ గోపాల్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోసిగి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కోసిగి మండలంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనుల కారణంగా శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ వీరేష్ తెలిపారు. కోసిగి మండలంలోని విద్యుత్ వినియోగదారులు, ప్రజలు, రైతులు, వ్యాపారులు గమనించి సహకరించాలని కోరారు. మధ్యాహ్నం 2గంటల నుంచి విద్యుత్ యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు.

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సెలవుల్లో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు సంక్రాంతి సెలవులు ప్రకటించినా కొన్ని పాఠశాలల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి తరగతులు నిర్వహిస్తుందన్నారు. దీంతో విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నారన్నారు. వెంటనే అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని విద్యార్థి సంఘం నాయకులు ధోని, రాజు, మహేష్, మాదవ్, హర్ష అన్నారు.

సాగు నీరు అందించేందుకు సర్వే

పెద్దకడుబూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులికనుమ రిజర్వాయర్ నుంచి చింతల చెరువు మీదుగా కోసిగి మండలంలోని పల్లెపాడు గ్రామ పరిధిలోని పొలాలకు సాగునీరు అందించేందుకు నీటి పారుదల శాఖ అధికారులు సర్వే చేపట్టారు. శుక్రవారం డిప్యూటీ ఈఈ కృష్ణన్న, ఏఈఈసీఎస్ శ్రీనివాసులు, హసీనా, లక్ష్మీదేవిలు పులిక నుమ చెరువు దగ్గర, చింతల చెరువు ప్రాంతాలను పరిశీలించి సర్వే చేపట్టారు. టీడీపీ సీనియర్ నాయకులు పల్లెపాడు రామిరెడ్డి, బసలదొడ్డి ఈరన్న, సర్పంచ్ శివరాములు, నాయకులు డొప్పి ఈరన్న, మల్లేష్, హనుమయ్య, రాజశేఖర్ పాల్గొన్నారు.



పులికనుమ దగ్గర సర్వే చేస్తున్న అధికారులు

ఘనంగా వైకుంఠ ఏకాదశి

- ఉత్తర ద్వారంలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు
- ఆలయాల్లో పూజలు చేసిన ప్రముఖులు

ఎమ్మిగనూరు/టౌన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలో వైకుంఠ ఏకాదశి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఏర్పాటు చేసిన ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు శుక్రవారం వేకువజాము నుంచే బారులు తీరారు. స్థానిక అన్నమయ్య సర్కిల్‌లో వెలసిన వెంకటసాయి ఆలయంలో స్వామివారికి పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మంత్రాలయం రోడ్డులో వెలసిన పద్మనాభ స్వామి ఆలయంలో సైతం భక్తులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకొని వైకుంఠద్వార దర్శనం చేసుకున్నారు. స్థానిక వెంకటసాయి ఆలయంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే వైసీపీ సీనియర్ నాయకులు జగన్మోహన్‌రెడ్డి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు జగన్మోహన్‌రెడ్డిలు కలిసి స్వామివారి రథోత్సవంలో పాల్గొని రథాన్ని లాగారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ పట్టణ పోలీసులు తెల్లవారు జాము నుంచే బందోబస్తు నిర్వహించారు.



కౌతాళం: స్వామివారి పల్లకి సేవలో పాల్గొన్న సిబ్బంది

కౌతాళం: మండలంలోని ఉరుకుంద దేవాలయం, కౌతాళం వేంకటేశ్వర స్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి పూజలను అర్చకులు ఘనంగా జరిపారు. ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు స్వామివార్ల దర్శనం కల్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈరన్న స్వామి ఆలయ వేద పండితులు మోహన్ మురళి కృష్ణ, ముఖ్య అర్చకులు ఈరన్న, శివన్న, ఆలయ సూపరింటెండెంట్లు మల్లికార్జున, వెంకటేశ్వర్లు దేవాలయంలో స్వామి వారి పల్లకోత్సవం చేపట్టారు.

మంత్రాలయం: మంత్రాలయం పాతవూరులో వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు వైభవంగా నిర్వహించారు. శుక్రవారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో స్వామి ఆలయాన్ని ప్రత్యేక పుష్పాలతో అలంకరణ చేసి తీర్చిదిద్దారు. కార్యక్రమంలో మఠం మేనేజర్ వెంకటేశ్ జోషి, శ్రీపతాచార్, అనంతపురాణిక్, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాషాచార్,విజేంద్రాచార్, సురేష్ కోనాపూర్, ఎస్ఐ పరమేష్ నాయక్, భక్తులు పాల్గొన్నారు.

రాఘువేంద్రస్వామి నిజరూప దర్శనం: వైకుంఠ ఏకాదశి సందర్భంగా రాఘవేంద్రస్వామి మఠంలో పీఠాధిపతులు సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో బృందావనానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం నిర్వహించారు. మూలరాములకు పూజలు చేసి మహామంగళ హారతులు చేశారు. రాఘవేంద్రస్వామి నిజ బృందావనాన్ని భక్తులు దర్శించుకున్నారు.

గోనెగండ్ల: మండలంలోని గోనెగండ్ల, గాజులదిన్నె, హెచ్ కైరవాడి, కులుమాల, అలువాల, వేముగోడు, చిన్నమరివీడు, గంజహళ్లి, అగ్రహారం గ్రామాల్లో ఉదయం నుంచే భక్తులతో వైష్ణవ, శైవ దేవాలయాలు కిక్కిరిపోయాయి. గోనెగండ్లలోని చింతాముని నల్లారెడ్డి స్వామి దేవాలయంలో స్వామివారికి ఆకుపూజ, మహామంగళహరతి, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం భక్తులు భజన కార్యక్రమం నిర్వహించారు.



ఎమ్మిగనూరు వెంకటసాయి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం కోసం బారులు తీరిన భక్తులు





పూజలు అందుకుంటున్న వెంకటనాథుడు, స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి



మంత్రాలయంలో భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న పీఠాధిపతి

రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్

పెద్దకడుబూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వే ఈనెల 20నుంచి చేయనున్నామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యాభరద్వాజ్ సూచించారు. శుక్రవారం మండలంలోని నౌలేకల్ గ్రామంలో భూ రీ సర్వేపై అవగాహన సమావేశాన్ని తహసీల్దార్ శ్రీనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రైతు తప్పనిసరిగా రీ సర్వేకు హాజరు కావాలని సూచించారు. రైతులు గ్రామాల్లో లేకపోయినా ఈ విషయాన్ని సర్వే సమయానికి వారికి తెలియజేసి వారు వచ్చేల చూడాలని అధికారులను ఆదేశించారు. రీ సర్వేలో భూముల లొసుగులు ఉంటే వెంటనే చర్యలు తీసుకొని తగిన న్యాయం చేస్తామని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. నౌలేకల్‌గ్రామంలో మూడు వేలకుపైగా ఎకరాల భూమి ఉందని ఈ మూడువేల ఎకరాలకు గాను నాలుగు టీంలు ఏర్పాటు చేశామన్నారు. రైతులకు నోటీసులు కూడా పంపిసామన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: ఎమ్మిగనూరు మండల పరిధిలోని కడిమెట్ల గ్రామంలో శుక్రవారం తహసీల్దార్ శేషఫణి, ఆర్ఐ లక్ష్మన్న, రెవెన్యూ సిబ్బంది రీ సర్వేపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి ఈనెల 20 నుంచి చేపట్టే రీ సర్వే గురించి రైతులకు తెలియజేశారు. సమావేశంలో రైతులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రాలయం: రైతులకు సంబంధించిన భూముల పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం రీసర్వే నిర్వహిస్తుందని తహసీల్దార్ ఎస్.రవి అన్నారు. శుక్రవారం చెట్నహల్లి గ్రామంలో సర్పంచ్ బెస్త ఆంజనేయులు, ఎంపీటీసీ రామాంజనేయులు, వీఆర్వో భీముడు అధ్యక్షతన ర్యాలీ నిర్వహించి గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సరస్వతి, మండల సర్వేయర్ అశోక్, నవీన్, భీరప్ప, శేఖర్ నాయక్, హేమచంద్ర, భవిత, హరిత, ధరణి, కీర్తి, నాగమణి, శోభ పాల్గొన్నారు.

గోనెగండ్ల: గోనెగండ్లను పైలెట్ ప్రాజెక్ట్ గ్రామంగా జిల్లా అధికారులు గుర్తించారని అందులో భాగంగా ఈనెల 20నుంచి రీసర్వే పనులు ప్రారంభం అవుతున్నట్లు తహసీల్దార్ కుమారస్వామి అన్నారు. శుక్రవారం గోనెగండ్లలో రెవెన్యూ అధికారులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గ్రామంలోని బస్టాండ్ ప్రాంగణం నుంచి సంతమార్కెట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పంచాయతీ కార్యాలయం దగ్గర గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ మేజర్ సర్పంచ్ హైమావతి, టీడీపీ నాయకులు నజీర్, రమేష్ నాయుడు, రాజశేఖర్‌ఆచారి, టమోటా ఉసేన్, ఫకృద్దీన్, మండల సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్

నందవరం: రీ సర్వే ద్వారా రైతులందరి సమస్యలు పరిష్కారం అవుతాయని తహసీల్దారు శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నదీకైరవాడి గ్రామంలో రీ సర్వే గ్రామ సభను డీటీ మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఐ-టీడీపీ తాలుకా అధ్యక్షుడు కురవవీరేష్, డీలర్‌బజారి, వీరారెడ్డి పాల్గొన్నారు.

కోసిగి: రీసర్వేలో ప్రతి రైతుకు రీసర్వే నోటీసులు ఇచ్చి తప్పులు లేకుండా సర్వే చేయాలని కోసిగి ఇన్‌చార్జి తహసీల్దార్ రుద్రగౌడు అన్నారు. శనివారం కోసిగిలో ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం గ్రామ వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లతో కలిసి తహసీల్దార్ కార్యాలయంలో రీసర్వేపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీరాములు, సీనియర్ అసిస్టెంట్ తిక్కస్వామి, మండల సర్వేయర్ వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేస్తున్న కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరు టౌన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనివాస సర్కిల్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను శుక్రవారం కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల నాణ్యత విషయంలో రాజీ పడకూడదని కాంట్రాక్టర్‌కు సూచించారు. పక్కనే ఉన్న అన్న క్యాంటీన్‌లో భోజనం నాణ్యత, పరిసరాలను తనిఖీ చేశారు. సిబ్బందికి ఆహార పంపిణీ విషయంలో పలు సూచనలు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

మంత్రాలయం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలం తుంగభద్ర రైల్వేస్టేషన్ సమీపంలో దిబ్బనదొడ్డి గ్రామ రైల్వే ట్రాక్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం గ్రామస్థులు గమనించి మాధవరం పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న మాధవరం హెడ్ కానిస్టేబుల్ వీరేష్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. రైల్వే సరిహద్దు దిమ్మెకు వైరుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని వయస్సు దాదాపు 40ఏళ్లలోపు ఉంటుందని తెలిపారు. గ్రామస్థులు ఈ ప్రాంతంలో భిక్షాటన చేస్తూ జీవిస్తుండేవాడని పేర్కొన్నారు. మృతదేహం వద్ద ఎటువంటి వివరాలు లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా వీఆర్వో పుష్పలత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పద్మశాలి కల్యాణ మండపానికి విరాళం



నగదు అందజేస్తున్న వెంకటేశ్వర కంటి వైద్యశాల నిర్వాహకులు

ఎమ్మిగనూరు , జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని తేరుబజారు ప్రాంతంలో ఉన్న పద్మశాలి కళ్యాణ మంటపంలో ఒక గది నిర్మాణం కోసం వీవర్స్ కాలనీలో ఉన్న వెంకటేశ్వర కంటి వైద్యశాల నిర్వాహకులు ఆడిమి వీరావతి, ఆమె కుమారులు రూ.1,51,000లను విరాళంగా అందజేశారు. శుక్రవారం స్థానిక కల్యాణ మంటపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పద్మశాలి బహూత్తమ సంఘం అధ్యక్షులు విశ్వనాథ్ రమేష్, యువజన సంఘం అధ్యక్షులు పోలె శ్రీనివాసులులకు విరాళం మొత్తాన్ని అందజేశారు. సభ్యులు పోలె వీరప్రసాద్, కాంచానం వీరేష్, ఆడిమి ఉరుకుంద, మారా శ్రీరాములు, పట్టా నాగరాజు పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ

కోడుమూరు రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమడగుంట్ల, ఎర్రదొడ్డి గ్రామాల్లో శుక్రవారం ఉపాధి పనులను ఏపీవో మోదీన్‌బాషా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మస్టర్లు తనిఖీ చేసి కూలీల హాజరు సరిపోల్చారు.

ఎల్ఐసీ కడప డివిజన్ డీవో అసోసియేషన్ అధ్యక్షుడిగా తిమ్మారెడ్డి

ఎమ్మిగనూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ కడప డివిజన్ డెవలప్‌మెంట్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా డీవో పాటీల్ తిమ్మారెడ్డి ఎంపికయ్యారు. శుక్రవారం ఎమ్మిగనూరు ఎల్ఐసీ కార్యాలయంలో ఏజెంట్లు, ఉద్యోగులు, డీవోలు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో బీఎం పులినాయక్, ఏబీఎం సంతోష్‌కుమార్, సంఘం నాయకులు విజయ్‌కుమార్, రఘునాథ్‌గౌడు, డీవోల నాయకులు రాజేష్, మదు, మొయినుద్దీన్, వీరాంజనేయులు, లియాఫీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, జయన్న, వీరేష్, వెంకటేశ్వరరెడ్డి, దేవేంద్రమూర్తి పాల్గొన్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో ఎమ్మెల్యేలు

మంత్రాలయం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి, వేంకటేశ్వరస్వామివార్లను ఎమ్మిగనూరు, మంత్రాలయం ఎమ్మెల్యేలు బీవీ జయనాగేశ్వర రెడ్డి, బాలనాగిరెడ్డి శుక్రవారం వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. శ్రీమఠం మహాముఖ ద్వారం వద్ద మఠం అధికారులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబు ధేంద్ర తీర్థులు ఆశీర్వదించారు. వీరి వెంట గుర్రెడ్డి భీమిరెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, వైస్ఎంపీపీ రాఘవేంద్ర, ఎంపీటీసీ వెంకటేష్ శెట్టి, జనార్దన్ రెడ్డి, కురువ మల్లికార్జున, గోరుకల్లు కృష్ణ, బంగారుబాబు, వికేసీ రఘు, పరమేష్, వీరారెడ్డి, ఎస్ఐ పరమేష్ నాయక్, మఠం జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్, అనంతస్వామి, అనంతపురాణిక్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఫ్రెండ్లీ వాలీబాల్ పోటీలు



మాట్లాడుతున్న రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు నీలకంఠేశ్వర స్వామి జాతరను పురస్కరించుకొని స్థానిక పాత తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో జర్నలిస్టుల ఫ్రెండ్లీ వాలీబాల్ పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను పట్టణ, రూరల్ ఎస్ఐలు డార్టర్ నాయక్, శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులు వార్తల సేకరణలతో నిత్యం తలమునకలై ఉంటారన్నారు. అలాంటి జర్నలిస్టులకు ఈ పోటీలు ఎంతో మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులను నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు బజారప్ప, హేమంత్‌కుమార్, ఖాశీం, హానిఫ్, ఫారుక్, దేవేంద్రమూర్తి, స్థానిక జర్నలిస్టు సంఘాల నాయకులు ఎస్.కె. షబ్బీర్, శ్రీనివాసుల నాయుడు, నాగరాజు, నూర్ అహ్మద్, మక్బుల్, రజాక్, నాగరాజు, సిరాలదొడ్డి రవికుమార్, రామకృష్ణ, రామకృష్ణ, ఈరప్ప, పార్థు, రాజు, రవి, జిలాన్ పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో ఉపాధిని ఊడ్చేశారు

- వలంటీర్లు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలకు మస్టర్లు
- కోసిగి మండలంలో ఉపాధిలో అవినీతి 11,57,339

కోసిగి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో 2023-24 సంవత్సరానికి గానూ ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేటీలు కోసిగి మండలంలో ఉపాధిలో ఊడ్చేశారు. ఉపాధి హామీ పథకం అమలులో వారు చేసిన భాగోతాన్ని సోషల్ ఆడిట్ బృందం బట్టబయలు చేసింది. మండలంలో 24 గ్రామ పంచాయతీల్లో పర్యటించి ఎస్ఆర్‌పీ నాగార్జున ఆధ్వర్యంలో డీఆర్పీలు, ఉపాధిలో ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేటీలు చేసిన భాగోతాన్ని బట్టబయలు చేశారు. శనివారం కోసిగిలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద 17వ సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. అన్ని గ్రామాల్లో అబ్జర్వర్లు పనుల పరిశీలనకు హాజరు కాలేదని ఆడిట్ బృందం సభ్యులు తెలిపారు. అదే విధంగా మస్టర్లలో సంతకాలు లేకుండా వేతనాలు చెల్లించారని అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కుంతల్లో చేసిన పనుల్లో 15నుంచి 20శాతం వరకు కొలతల్లో వ్యత్యాసాలు ఉన్నాయని, ఏ గ్రామంలో కూడా జాబ్‌కార్డులు అప్‌డేటు చేయలేదని, ఒకే ఇంటిలో వేర్వేరుగా జాబ్‌కార్డులు ఇచ్చారన్నారు. చేసిన పనులకు జియో ట్యాగింగ్, ఎంబుక్ జిరాక్స్ కొన్ని పనులకు ఇవ్వలేదన్నారు. పెద్దభోంపల్లి గ్రామానికి చెందిన సవారి రామకృష్ణ, సవారి రాధ భార్యాభర్తలు ఎనిమిదేళ్ల నుంచి హైదరాబాదులో నివాసముంటున్నా 2023-24లో వారి పేర్ల మీద హాజరు వేసి రూ.51వేలు వేతనం చేశారని గ్రామస్థులు పీడీకి ఫిర్యాదు చేశారు. అలాగే అదే గ్రామానికి చెందిన సుందర్‌రాజు అనే వ్యక్తి కోసిగిలో ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పని చేస్తున్న కూడా సంవత్సర కాలం పాటు హాజరు వేశారని, పనులకు రాకున్న వేతనాలు అందించారన్నారు. అలాగే డి.బెళగల్ గ్రామానికి చెందిన అయ్యారెడ్డి జాబ్‌కార్డు నెంబర్. 10085 ఏడు సంవత్సరాల క్రితమే చనిపోయినా కూడా నేటికి హాజరు వేశారని, మంగళి రామాంజని జాబ్‌కార్డు నెంబరు 10281 మూడు సంవత్సరాల క్రితమే మరణించాడని, అలాగే హరిజన వనులయ్య మూడు ఏళ్ల క్రితమే చనిపోయాడని వారికి హాజరులు వేశారని గ్రామస్థులు ప్రిసీడింగ్ అధికారికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అలాగే నేల కోసిగి గ్రామంలో సర్పంచ్‌తో పాటు ఎండీఎం, వలంటీర్, మరణించి నాలుగేళ్ల అవుతున్న వ్యక్తులకు కూడా హాజరు వేయడమే కాకుండా ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగం చేస్తున్న వారికి కూడా ఉపాధిలో హాజరు వేసి అవినీతికి తెరలేపారని సోషల్ ఆడిట్‌లో బట్టబయలైంది. మండలంలో అత్యధికంగా చింతకుంటలో రూ.2,99,405లు అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు తెలిపారు, ఐరంగల్‌లో రూ.1,08,097లు కందుకూరులో 1,15,094లు, సాతనూరులో 93,797లు అవినీతి ఉపాధిలో జరిగినట్లు వారు తెలిపారు. మండలం లో మొత్తం మీద రూ.11,57,339లు అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీలో బట్టబయలైంది. వందగల్లులో పండ్లతోటల మొక్కల్లో ఒక మొక్క కూడా కనిపించలేదని అధికారులు ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లపై, ఉపాది సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో అడిషినల్ పీడీ మాధవీలత, జిల్లా విజిలెన్స్ అధికారి లోకేశ్వర్, విజిలెన్స్ అండ్ సెక్షన్ పీడీ ఆదినారాయణ, ఎస్ఆర్‌పీ నాగర్జున, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఏపీవో చంద్రశేఖర్, ఈసీ విజయరాజు, ఎంపీపీ వీరన్న, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి పాల్గొన్నారు.



ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు